
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.05.2015, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 49
పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## » రాష్ట్రానికి మంత్రా? తుళ్లూరుకు వీఆర్‌ఓనా?



# బిల్డ(ప్)ర్ నారాయణ


**రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి... రాష్ట్ర ప్రభుత్వంలో చాలా కీలకమైన శాఖ. సంబంధిత మంత్రికి అసలు తీరిక వుండదు. పాలనా పరంగా పెద్ద శాఖ. రాష్ట్రంలోని కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీల వ్యవహారాలన్నీ సదరు మంత్రి పరిధిలోనే ఉంటాయి. మంత్రి తన పాలనా కాలంలో ప్రతి మున్సిపాల్టీకి ఒక్కసారైనా పోయి రావొచ్చు. ప్రతి మున్సిపాల్టీ వ్యవహారాలను తన ఛాంబర్ నుండే పర్యవేక్షించవచ్చు. రాష్ట్ర మున్సిపల్ మంత్రి ఛాంబర్ హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉంది.**

అయితే ప్రస్తుతం అనధికారికంగా గుంటూరుజిల్లా తుళ్లూరులో ఏర్పాటై వుంది. మున్సిపల్ మంత్రి పి.నారాయణ హైదరాబాద్‌లో కంటే, తన సొంతూరు నెల్లూరులో కంటే కూడా నూతన రాజధాని కేంద్రమైన తుళ్లూరులోనే ఎక్కువుగా ఉంటున్నాడు. అక్కడే తింటున్నాడు, అక్కడే పడుకుంటున్నాడు. ఒకవేళ పగలు ఎక్కడ

(మిగతా 14వ పేజీలో)

## పుత్రుడిపై...

# చంద్రుడి అత్యుత్సాహం!




## • రాజ్యాంగేతర శక్తిగా లోకేష్

**ఎవరికైనా పుత్రోత్సాహం సహజం. కాని అది అత్యుత్సాహంగా మారితేనే ప్రమాదం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పుత్రోత్సాహం శృతి మించుతోంది. చరిత్రలో ముఖ్యంత్రుల భార్యలు, బిడ్డలు అధికారశక్తులుగా తెరవెనుక నుండి పనిచేసిన సందర్భాలున్నాయి. అంతేగాని ఎప్పుడూ ప్రత్యక్షంగా అధికార విధులలో పాలుపంచుకోలేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా గతంలో పనిచేసినవాళ్లు పరిపాలనలో తమ కుటుంబసభ్యుల నీడ కూడా పడకుండా చూసుకున్నారు.**

స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా వున్నంతకాలం ఆయన కుమారులు గాని, కూతుర్లు గాని క్యాంప్ ఆఫీసులో అడుగుపెట్టలేదు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కూడా ముఖ్యమంత్రిగా వున్నప్పుడు తన కొడుకులను అధికారిక కార్యక్ర మాలకు దూరంగానే ఉంచారు. వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నంతకాలం వై.యస్.జగన్మోహన్‌రెడ్డి బెంగుళూరులో వ్యాపారాలు చేసుకున్నాడే గాని ఇక్కడికొచ్చి తండ్రి పారిపాలనా వ్యవహారాలలో వేలుపెట్టలేదు. ఇలా రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎంతోమంది నాయకులు కుటుంబసభ్యుల నీడ పడకుండా పరిపాలన చేశారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో మాత్రం ఆయన కొడుకు లోకేష్ ప్రాబల్యం ఎక్కువైపోయింది. ఆయనొక రాజ్యాంగేతర శక్తిలా తయారయ్యాడనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటన మరీ వివాదాస్పదమైంది. రాష్ట్రంలో పెట్టుబడుల కోసమని ఆయన అమెరికా వెళ్లారు. రాష్ట్రం తరపున ఏ హోదాలో వెళ్లారనే ప్రశ్నకు సమాధానం లేదు. అంతేగాక ఇద్దరు ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆయన వెంట పంపించారు. ఏ అధికారంతో ఇలా పంపిస్తారు? లోకేష్ సిఎం కాదు, మంత్రి కాదు. అంతేగాక అమెరికా అధ్యక్షుడు ఒబామాతో 10వేలడాలర్లు కట్టి లోకేష్ భేటీ అయ్యాడనేది పెద్ద దుమారం రేపుతోంది. ఏదేమైనా పుత్రోత్సాహంతో చంద్రబాబు రాజ్యాంగ విలువలకు తిలోదకాలివ్వడం ప్రజాస్వామ్య విధానానికి మంచిది కాదు.




# అస్తమించిన ప్రకాశం



**నిజాయితీకి, నిరాడంబరతకు రాజకీయాలలో ఐఎస్ఐ మార్కులాంటివాడు గూడూరు మాజీ శాసనసభ్యులు పత్రా ప్రకాశరావు. నేటితరం రాజకీయ నాయకులకు నిలువెత్తు ఆదర్శం. దళిత కుటుంబంలో పుట్టిన ఆదర్శనీయ వ్యక్తి. రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగకపోయినా జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఆయన ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. దీనికి కారణం ఆయన మచ్చలేని వ్యక్తిత్వం. నిజాయితీ, నిరాడంబర జీవితమే. అలాంటి మంచి నాయకుడు ఈ నెల 4వ తేదీన నెల్లూరు, మూలాపేటలోని తన స్వగృహంలో కన్నుమూసారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.**

ప్రకాశంది ప్రకాశం జిల్లా కొనకలమిట్టలోని దళితవాడ. 1944 జూలై 15న పుట్టారు. పేద దళిత కుటుంబం. అయితే స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డిని ఆయనకు దైవంగా చెప్పుకోవచ్చు. చిన్నతనంలోనే కోట మండలం విద్యానగర్‌కు వచ్చి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఇక్కడ నిర్వహిస్తున్న హరిజన ఉద్ధారక కమిటి హాస్టల్‌లో ఉంటూ బి.ఏ దాకా చదివారు. తర్వాత అదే హాస్టల్‌కు వార్డెన్ అయ్యారు. అక్కడే పనిచేసే సారాబాయ్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇక్కడే నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితో ఆయనకు పరిచయం ఏర్పడింది.

(మిగతా 14వ పేజీలో)

# నేత్రపర్వంగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు



పెంచలకోనలో వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామివార్లను వేంచేపు చేసి, అలంకార మండపం నుంచి శ్రీవారి నందన వనంలో ఏర్పాటుచేసిన కల్యాణమండపానికి తీసుకువచ్చి అత్యంత వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయరాజు స్వామివార్ల కల్యాణోత్సవానికి తలంబ్రాలను తీసుకువచ్చి సమర్పించారు. ఎమ్మెల్యే తీసుకువచ్చిన 41 రకాల పుష్పాలతో స్వామివార్లకు ఆలయ అర్చకులు పుష్పాభిషేకం నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యంలో స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ పురాణ పండితుడు పుల్లాభట్ల వెంకటేశ్వర్లు (గుంటూరు) స్వామివారి కల్యాణోత్సవం విశిష్టతను, వైభవాన్ని భక్తులకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఆదివారం రాత్రి స్వామివారికి రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. శోభాయమానంగా స్వామిని, అమ్మవార్లను అలంకరించి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని, దేవేరులైన ఆదిలక్ష్మి–చెంచులక్ష్మి అమ్మవార్లతో అంబారీపై పెంచలకోన మాడవీధుల్లో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరెడ్డి, ఇ.ఓ శ్రీరామమూర్తి, తహశీల్దార్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# పట్టుబడ్డ రేషన్ బియ్యం లారీ

నెల్లూరుజిల్లా ఆత్మకూరు టెంకాయతోపుకు చెందిన రమణయ్య ఆత్మకూరు పౌరసరఫరాల గోడౌన్ నుంచి నెల్లూరుకు లారీలో 243రేషన్ బియ్యం బస్తాలను తరలిస్తుండగా సమాచారం మేరకు బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఐ బస్టాండ్ కూడలి రాజ్‌కిషోర్ సినిమాహాలు వద్ద లారీని పట్టుకున్నారు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ ఎస్.సుల్తాన్, పెంచలయ్యలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. లారీలోని రేషన్‌బియ్యం నెల్లూరులో ఏ మిల్లుకు తరలించే విషయం తెలియాల్సి వుంది. ఈ బియ్యం లారీని బుచ్చి పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్‌కు స్వాధీనం చేశారు.

# రూ.1500కోట్లతో నీరు–చెట్టు

## – రాష్ట్రమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు

తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన జలదీక్షలో భాగంగా నీరు–చెట్టు కార్యక్రమాలకు రూ.1500కోట్లు ఖర్చు చేయనున్నట్లు భారీ నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం కరటంపాడులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.25కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యేడాది జిల్లాలో 8.35లక్షల ఎకరాల్లో పంటలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. నీరు–చెట్టు కార్యక్రమం కింద ఏడాదికి 15కోట్ల మొక్కలు, ఐదేళ్లలో 75కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యమన్నారు. జిల్లాలో ఈ యేడాది 1.5కోట్ల మొక్కలు నాటుతారని వివరించారు. రాష్ట్రంలోని 46వేల చెరువుల రూపురేఖలు మార్చే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. కావలి కాలువ ఆధునీకరణ పనులు రూ.25కోట్లతో ఆగస్టులోపు పూర్తవుతాయన్నారు. రూ.1500కోట్లతో నిర్మించే సోమశిల హైలెవల్ కాలువను నాణ్యమైన పనులతో నిర్మించాలని సూచించినట్లు తెలిపారు. ఈ యేడాదిలో జిల్లాలో 10లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా చేయాలనే లక్ష్యం ఉందన్నారు.

ఈ సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యేలు బీద మస్తాన్ రావు, కంభం విజయరామిరెడ్డి, నాయకులు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.






## డ్రైవర్ల సంఘ జిల్లా కార్యవర్గం ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. జిల్లా అధ్యక్షులు కె.చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ.భాస్కర్, ఉపాధ్యక్షుడిగా బి.హరిబాబు, కె.నారాయణరావు, పి.హజరత్తయ్య, వి.రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా ఏ.సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా సి.హెచ్.రఘురామరెడ్డి, వి.కృష్ణయ్య, జి.ఎల్లయ్య, ఎం.సుబ్రహ్మణ్యం, వై.సుబ్బరాయుడు, కోశాధికారిగా బి.బాబూరావు, పలువురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో సోమశిల చేప

నెల్లూరు నగరంలోని సోమశిల భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ సోమవారం సాయంత్రం రెండువేలు లంచం తీసుకుంటూ ఏసిబి వలలో చిక్కారు.

ఏసిబి డిఎస్పీ ఆర్‌విఎస్ఎం మూర్తి వివరాల మేరకు సోమశిల ప్రాజెక్ట్ కట్ట నిర్మాణ సమయంలో బొంతల శేషయ్యకు చెందిన ఇంటి స్థలాన్ని భూసేకరణ విభాగం సేకరించింది. దానికి తగిన నష్టపరిహారం చెల్లించడంతో పాటు 1982 అవార్డు కాపీని ఇచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బేల్దారిపనులు చేసుకుంటున్న శేషయ్య మనుమడు కఠారి అరుణ్‌కుమార్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. దానికి సంబంధించి ప్రూఫ్ ఆఫ్ అవార్డ్ కాపి కోసం నెల్లూరులోని సోమశిల భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ టి.రమేష్‌కుమార్‌ను కలిసారు. దీంతో రమేష్‌కుమార్ రూ.3,500లు ఇస్తే అవార్డు కాపీని ఇస్తానని చెప్పాడు. రెండువేలకు ఒప్పందం కుదిరింది. అరుణ్‌కుమార్ ఏసిబి అధికారులను కలిసాడు. పథకం ప్రకారం రెండువేల రూపాయలు రమేష్‌కుమార్‌కు ఇస్తుండగా ఏసిబి అధికారులు దాడి చేసి పట్టుకుని రసాయన పరీక్షలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నెల్లూరు అరవిందనగర్‌లోని రమేష్ కుమార్ ఇంట్లో ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. రమేష్‌కుమార్‌ను ఏసిబి అధికారులు 4వ నగర పోలీసు స్టేషన్‌కు తరలించారు.




వారం వారం ప్రతి ఒక్కరినీ అలరించే వార్తామణిహారం
లాయర్ తెలుగు వారపత్రిక
తన అక్షర యజ్ఞంలో మరో మలుపుగా
కావలిలో శాఖను ప్రారంభిస్తున్న శుభవేళ...
మా శుభాకాంక్షలు.

డా॥ రవికుమార్
RICH HOSPITALS FOR CHILDREN
రిచ్ చిన్నపిల్లల హాస్పిటల్
పొగతోట, నెల్లూరు ఫోన్: 0861-2328562.

Director & Chief Consultant
Dr. T. Ravikumar MD., DCH

Senior Consultant Pediatricians
Dr. G. Narayana Swamy
Dr. Ch. Hazarathaiah
Dr. Sk. Nazeer
Dr. R. Umamaheswara Rao

24 గం॥లు చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

### ఆశించే పదవులు కాకుండా...

# అవసరం లేనివి ఇచ్చారు!








తెలుగుదేశంపార్టీని జాతీయ పార్టీగా మార్చే ప్రక్రియకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో పార్టీ ఉంది. తమిళనాడు, కర్నాటకలకు కూడా క్రమక్రమంగా పార్టీని విస్తరించాలనేది ప్లాన్. ఈ రాష్ట్రాల్లో 6శాతం ఓట్లు సాధిస్తేనే తెలుగుదేశంకు జాతీయ గుర్తింపు వస్తుంది. తమిళనాడు, కర్నాటకలలో తెలుగువాళ్ళు ఎక్కువగా వున్నారు. తమిళనాడులో చెన్నైతో పాటు తిరువళ్లూరు, వేలూరు, కోయంబత్తూరు వంటి జిల్లాల్లో తెలుగువాళ్లు ఎక్కువగా వున్నారు. అలాగే కర్నాటకలో చూస్తే సగం బెంగుళూరు తెలుగువాళ్లదే. బళ్లారి జిల్లాలో ఆధిపత్యం తెలుగువాళ్లదే! వీళ్లను దృష్టిలో పెట్టుకునే తెలుగుదేశం పార్టీ వాళ్లు అక్కడ ఈ నెల 10 నుండి సభ్యత్వాల నమోదుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం కమిటీలను వేయగా అందులో నెల్లూరు నేతలకు పెద్దపీట దక్కడం విశేషం. పదవు ల్లోనూ, ప్రగతిలోనూ నెల్లూరుజిల్లాకు మొండిచేయి చూపించే చంద్రబాబు ఈ విషయంలో మాత్రం ప్రత్యేకప్రేమ చూపించారు. జాతీయపార్టీ పరిశీలకులుగా బీద రవిచంద్రను నియమించారు. అలాగే తమిళనాడులో పార్టీ బాధ్యతలు చూసే కమిటీలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బీద మస్తాన్‌రావు, వేనాటి రామచంద్రారెడ్డిలను నియమించారు. వీళ్లందరికీ చెన్నైతో పాటు సరిహద్దుల్లో వున్న తమిళ ప్రాంతాలతో సంబంధాలుండడంతో ఈ కమిటీలో వేశారు. అలాగే కర్నాటక రాష్ట్ర కమిటీలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఆశించిన పదవులు ఇవ్వకున్నా ఈ పదవులతో వారిని బుజ్జగించాడు చంద్రబాబు.

### చెంగాళమ్మ సన్నిధిలో అన్నదానానికి

# అన్నదమ్ముల విరాళం



సూళ్లూరుపేటలో భక్తుల కొంగుబంగారంగా వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అన్నదానం కోసం నెల్లూరుకు చెందిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సూళ్లూరు శ్రీహరిరెడ్డి, వారి సోదరులు సూళ్లూరు శివకుమార్‌రెడ్డి, సూళ్లూరు ఉదయభాస్కర్‌రెడ్డిలు లక్షా50వేల రూపాయలు విరాళంగా అందజేశారు. తమ తండ్రి సుళ్లూరు బలరామిరెడ్డి, నాయనమ్మ వెంకటలక్ష్మమ్మల జ్ఞాపకార్ధం వారు ఈ విరాళాన్ని ఈ నెల 3వ తేదీన ఆలయ కమిటి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డికి ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటి సభ్యులు అయితా శ్రీధర్, వేదగిరి రెడ్డి, దొరబాబురెడ్డి, ఐసిఎంఎస్ డైరక్టర్ జెట్టి వేణుయాదవ్, కోడూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టుకు ఉత్తమ సంక్షేమ అవార్డు



సంక్షేమ రంగంలో చేసిన కృషికి గాను నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్‌కు ఉత్తమ సంక్షేమ అవార్డు లభించింది. రాజమండ్రిలో జరిగిన మేడే వేడుకలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కెపిసిఎల్ ఉన్నతాధికారి ఎస్.సుబ్బారావు ఈ అవార్డును స్వీకరించారు. బెస్ట్‌మేనేజ్‌మెంట్‌తో పాటు మెమొంటోను, సర్టిఫికేట్‌ను కూడా ఆయన అందుకున్నారు.


# విజయాభినందనలు



నెల్లూరు జిల్లా
స్థానిక పత్రికా ప్రపంచంలో
34 సంవత్సరాలుగా
చెరగని ముద్ర వేసుకుని
అంచలంచెలుగా తన
ఉనికిని విస్తరించుకుంటూ
మొన్న గూడూరు
నేడు కావలి శాఖలతో
జిల్లా గ్రామీణ ప్రాంత వార్తలకు
పెద్దపీట వేస్తున్న
లాయర్
తెలుగు వారపత్రికకు
విజయాభినందనలు.

కె.వి.రత్నం
ఫౌండర్ డైరక్టర్
ఎడ్యుకేషనలిస్ట్

కె.వేణుగోపాల్
మేనేజింగ్ డైరక్టర్

డాక్టర్ కె.కృష్ణకిషోర్
అకడమిక్ డైరక్టర్

శీలేన శోభతే విద్య

రత్నం విద్యాసంస్థలు
నెల్లూరు చిత్తూరు

## 'ప్రభా'తం

వట్టి మాటలు బహు గట్టిగానే వుంటాయని పెద్దల మాట. అందులోనూ రాజకీయ నాయకులు చెప్పే మాటలు, ఇచ్చే హామీలకు కొదవే వుండదు. అధికారంలో వున్న వారైతే ఇక రోజూ మాటల కోటలే కడుతుంటారు. ఇదంతా మామూలే. అయితే, ఆ మాటలు అమలులోకి వస్తున్నాయా?.. ఇచ్చిన హామీలు నెరవేరుతున్నాయా?..అనేది చూడకుండా పథకాల మీద పథకాలు ప్రకటించినా ప్రయోజనం వుండదు.

ఇప్పుడు మన రాష్ట్రం పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే వుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదే కోవలో నిత్యం బోలెడన్ని పథకాలు ప్రకటిస్తూనే వున్నారు. అయితే, ఆ పథకాల్లో కొన్ని ఎంతో మంచివి వున్నాయి. కానీ, ఆ పథకాల అమలులో చిత్తశుద్ధి వుండడం లేదు. గతంలోనూ ఇలాంటివెన్నో పథకాలను ఆయన చేపట్టారు. జన్మభూమి, శ్రమదానం, ఇంకుడు గుంతలు, నీరు-మీరు ఇలాంటివి ఎన్నో. ఇప్పుడు కూడా అదే కోవలో నీరు- చెట్టు, జలదీక్ష వంటివెన్నో పుట్టుకొస్తూనే వున్నాయి. అయితే, పథకాలు మంచివైనంత మాత్రాన వాటిని ప్రజల దరిచేర్చేందుకు అవసరమైన యంత్రాంగం లేకపోవడమే విచారకరం. సకల మానవాళికీ, ముఖ్యంగా రైతాంగానికీ ప్రాణప్రదమైన జలాలను సద్వినియోగం చేసుకోవడానికి చేసే ఏ చిన్న ప్రయత్నమైనా హర్షించ దగినదే. ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టుకోవాలి. భూగర్భ జలాలను పెంపొందించుకోవాలి. జలమే జీవకోటికి ప్రాణాధారం కనుక, మొక్కలను, వనాలను విరివిగా పెంచి పర్యావరణాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ప్రకృతి ప్రసాదించిన జలాలను పరిరక్షించుకోకుంటే నష్టపోయేది మనమే. భూగర్భ జలాలు ఎండిపోతే కష్టపడాల్సిందీ మనమే. నేటికీ అనేక గ్రామాల్లో ప్రజలకు చుక్కనీరు దొరక్క, ఏ పొలాల వెంబడో పడి, కుండలు బిందెలు చేతపట్టు కుని వ్యవసాయ బోర్ల వద్ద పడిగాపులు పడుతూనే వున్నారు. కుళాయిల్లో నీళ్ళు రాక, మంచినీటి పథకా లున్నా పనిచేయక నిత్యం మంచినీటికే నానా అవస్థలు పడే గ్రామాలు రాష్ట్రంలో కొల్లలుగా వున్నాయి. ఇవన్నీ ఏలినవారికి తెలియదనుకోలేం. అయితే భవిష్యత్తులోనైనా ఇలాంటి కష్టాలు తొలగిపోవాలంటే.. ప్రకృతినీ- పర్యావరణాన్నీ పరిరక్షించుకోవాల్సిందే. ప్రతి నీటి బొట్టును భద్రంగా కాపాడుకోవాల్సిందే. మొక్కలు, వనాలు విస్తారంగా పెంచి, మంచి ప్రకృతి వాతావరణానికి బాటలు వేసుకోవాల్సిందే. అయితే, ఇవేమీ తాత్కాలిక పథకాలు కాదు. దీర్ఘకాలిక పథకాలు. శాశ్వత ప్రాతిపదికపై చేపట్టాల్సిన పథకాలు. ప్రతిచోటా మొక్కలు నాటుతూనే వుండాలి. వాటికి నీళ్ళు పోస్తూనే వుండాలి.. అవి బాగా ఎదిగే దాకా సంరక్షిస్తూనే వుండాలి. మరోవైపు చెరువుల్లో పూడిక తీయిస్తుండాలి. కాలువలు బాగు చేయిస్తుండాలి. చెక్‌డ్యామ్‌లు కట్టిస్తుండాలి.ఇదంతా నిరంతరంగా జరుగుతూనే వుండాలి. ఇంకోవైపు అడవులను, ఉద్యానవనాలను విస్తరిస్తుండాలి.. రాష్ట్రవ్యాప్తంగా ఇవన్నీ చేపట్టాలంటే బృహత్‌యజ్ఞమే అవుతుంది. అయితే, ఖచ్చితమైన ప్రణాళిక లేకుండా ఇవన్నీ చేయడం సాధ్యమేనా?..మొక్కలు నాటేదెవరు?..వనాలను విస్తరించేదెవరు?.. ఇప్పటికే ఎంపిడిఓలు, పంచాయతీరాజ్ ఏఇలు, వ్యవ సాయాధికారులు, విఆర్‌ఓలకు ఈ బాధ్యతలు కేటాయించారు. వారికి ఇంకా అవగాహన సదస్సులు నిర్వహిస్తూనే వున్నారు కూడా. మూడు నెలల క్రిందటే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించినా అమలు చేసేందుకు తగ్గ వ్యవస్థ లేకపోవడం వల్లే ఇది ఇంకా బాలారిష్టాల్లోనే వుంది. ఎందుకంటే, నీటిపారుదల శాఖ, వ్యవసాయశాఖ, అటవీశాఖలు వేర్వేరుగా వున్నా, ఆయా శాఖలకు సంబంధించిన కార్యాలు బోలెడన్ని వుండనే వుంటాయి. ఇంకా, పంచాయతిరాజ్ శాఖ, రెవెన్యూశాఖ వగైరాలు రంగంలోకి దిగినా వారికున్న పనివత్తిడిలో 'నీరు-చెట్టు'కు చేయగలిగింది సమీక్షా సమావేశాలు మినహా మరేమీ వుండదు. అందువల్ల, అన్ని పథకాల్లాగా కాకుండా ఇలాంటి మంచి పథకాలను అమలులో పెట్టేటప్పుడు ముందుచూపుతో వ్యవహరించాలి. రాజకీయప్రయోజనాలను ఆశించి కాక, ప్రజాప్రయోజనాలపై దృష్టి సారించాలి. ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళిక వుండాలి. ఇప్పుడు మనలో లోపించిందల్లా ఇదే. అందుకే, ఒకసారి మళ్ళీ ఈ పథకం అమలు తీరును సమీక్షించుకుంటే బావుంటుంది. గతంలో జరిగిందేమిటి?.. ఇప్పుడు జరగాల్సిందేమిటి?.. ఇప్పటికే పెండింగ్‌లో వున్న పనులు- పథకాలు.. ప్రాజెక్టుల స్థితిగతులేమిటి? నీరు-చెట్టు కోసం అసలు గుంతలు తవ్వేదెవరు? మొక్కలు తెచ్చేదెవరు?. వాటిని నాటేదెవరు?.. నిత్యం నీళ్లు పోసేదెవరు?.. అవి ఎండిపోకుండా కంటికి రెప్పలా కాపాడుకునేదెవరు?.. ఇవన్నీ ఆలోచించాలి. రాష్ట్రం లోని అన్ని గ్రామాల్లో వాడవాడలా చేపట్టేందుకు తగ్గ ప్రణాళిక వుండాలి. ఇలాంటి పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపరిచే యంత్రాంగం లేకపోవడమే ఒక పెద్ద శాపం. అన్ని పథకాలకు సంబంధించిన పనులూ అదే అధికారులు, అదే సిబ్బంది చేయాలంటే సాధ్యమా?.. సాగునీటికీ, మంచినీటికీ ప్రత్యేక వ్యవస్థలు వున్నట్లే 'నీరు-చెట్టు' వంటి పథకాలకు ప్రత్యేక యంత్రాంగం వుండాలి. వాడవాడలా ఆసక్తిగల ప్రత్యేక బృందాలు మొక్కల పరిరక్షణ బాధ్యతను చేపట్టే విధంగా వుండాలి. ఆయా ప్రాంతాల్లోని ప్రముఖులు, నాయకులు, ప్రజలు, యువత, స్వచ్ఛంధ సంస్థలవారు ఇలా అందరి భాగస్వామ్యం వుండేలా చూడాలి. పాలకులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఇది శాశ్వత ప్రాతిపదికన కొనసాగేలా ఒక ప్రత్యేక చట్టం చేయాలి. అందరి కోసం అందరూ కలసి పనిచేసినప్పుడే ఇలాంటి పథకాలు సత్ఫలనిస్తాయే తప్ప, అన్నీ ఏ కొంతమంది అధికారులో, లేదా సిబ్బందో చేయాలంటే కుదురుతుందా?.. ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి..పిడుక్కీ-బియ్యానికీ ఒకే మంత్రమంటే పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తుంది.. అసలు పథకానికే ఎసరు వస్తుంది. కాబట్టి, ఇలాంటి మంచి పథకాల అమలులో బాగా ఆలోచించి ముందడుగు వేయాలి. ఆ అడుగు భావితరాలకు మార్గదర్శకం కావాలి. అది సకల జనావళికీ శుభాలు పూయాలి. అందుకే, ఇకనైనా..కాస్త ఆగండి..కొంచెం ఆలోచించండి!...

### ఆగండి... కొంచెం ఆలోచించండి



'నీరు-చెట్టు' వంటి బృహత్ పథకాల అమలులో చిత్త శుద్ధి ఎంతో అవసరం. భవిష్యత్తరాల వారికి కూడా ఉప యోగంగా వుండే ఇలాంటి పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపరిచేందుకు ప్రత్యేక యంత్రాంగం లేకపోవడమే ఒక పెద్ద శాపం. సాగునీటికీ, మంచినీటికీ ప్రత్యేకవ్యవస్థలు వున్నట్లే 'నీరు-చెట్టు' వంటి పథకాలకు కూడా ప్రత్యేక యంత్రాంగం వుండాలి. అవసరమైతే అందుకు తగు చట్టం కూడా వుండాలి. ప్రజలందరి భాగస్వామ్యంతో ఇది కలకాలం వర్ధిల్లేలా చూడాలి. అలాకాక, పిడుక్కీ-బియ్యానికీ ఒకే మంత్రమంటే పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తుంది.. అసలు పథకానికే ఎసరు వస్తుంది.



శ్రీకరణికి బహుమతి ప్రదానం చేస్తున్న యండమూరి వీరేంద్రనాథ్

## మననంతోనే మంచి భవిష్యత్తు

**- ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్**

మనం ఏమిచేస్తున్నామో తరచూ తరచి చూసుకుంటూ, మనల్ని మనం మననం చేసుకున్నప్పుడే మంచి కార్యాలు సాధించేందుకు అవకాశం వుంటుందని, తద్వారా మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని చింతారెడ్డిపాళెంలో వున్న నారాయణ వైద్యకళాశాలలో ఈ నెల 2న జరిగిన ద్రిష్యా-2015 పేరుతో ఆ కళాశాల వారు నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమాజానికి మంచి సేవలందించాలని ఆకాంక్షించారు. నారాయణ వైద్యకళాశాల వాతావరణం ఎంతో బావుందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటుడు గౌతంరాజు మాట్లాడుతూ పేదవారికి వైద్యసేవలను అందుబాటులో వుంచాలని, పేదల నుంచి ఎక్కువ ఫీజులు తీసుకోకుండా, వారికి అవసరమైన వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. స్టార్ హాస్పిటల్ ఎం.డి గోపీచంద్ మాట్లాడుతూ ఎవరైనా సరే..నిబద్ధతతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు వస్తుందని అన్నారు. చదువు చెప్పిన గురువులను విస్మరించకుండా వారితో సన్నిహితంగా వుంటూ గౌరవించాలన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ వస్త్రప్రదర్శన పోటీల్లో గెలుపొందిన శ్రీకరణికి యండమూరి వీరేంద్రనాథ్ బహుమతి అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీరి నాగిరెడ్డి, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ నర్సింహారెడ్డి, సిఇఓ డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, ఏజిఎం భాస్కరరెడ్డి, ఏ.ఓ డాక్టర్ సుబ్బారావులతో పాటు డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్‌శర్మ, డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మికులు లేని జిల్లాగా చేద్దాం

**- జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి**




బాల కార్మిక నిర్మూలనకు నిర్దేశించిన చట్టాలను పటిష్టంగా అమలుచేసి, ఈ జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు గోల్డన్‌జూబ్లీ హాల్లో బాలకార్మిక నిర్మూలన, అక్రమరవాణా మరియు పునరావాసంపై జరిగిన వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో నిర్దేశించిన చట్టాలను ప్రభుత్వ అధికారులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ చట్టం 1986లో ప్రవేశపెట్టారని, దాదాపు జిల్లాలో 6,000 మంది బడి మానేసిన బాలకార్మికులు వున్నట్లు గుర్తించడం జరిగిందని, చట్ట ప్రకారం స్వచ్ఛంధ సంస్థల సలహాలననుస రించి జిల్లా కేంద్రంలో జిల్లా రిసోర్స్ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేసి సమర్ధ వంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాలకార్మిక నిర్మూలన వ్యవస్థపై ప్రతినెల సమీక్షా సమావేశాలు నిర్వహించుకొని తగిన సమగ్ర తనిఖీలు నిర్వహించి సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలకార్మికులు ఎక్కువగా ఫ్లాట్‌ఫారాలలో, రైళ్లలో, బస్‌స్టేషన్లలో, ప్రధాన కూడళ్ల వద్ద వుండే అవకాశం వున్నందున అటువంటి ప్రాంతాల్లో తని ఖీలు నిర్వహించి వారికి పునరావసం కల్పించడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

## కాంట్రాక్టర్లతో కుమ్మకు

పార్లమెంటులో మొట్టమొదటి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య సొంత మండలం విడవలూరులో రోడ్లు అక్రమాలకు నెలవుగా వున్నాయి. విడవలూరు నుండి వడ్డిపాలెం దాకా సిమెంట్‌రోడ్లు ఒక పక్కన తగ్గిస్తూ, ఇంకోపక్క పెంచుతూ ఆక్రమణలు తొలగించకుండా వేస్తున్నారు. ఆక్రమణదారులతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారు. ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలి. విజిలెన్స్ విచారణ జరిపించాలి.

*-బి.ప్రభాకర్,* **నెల్లూరు.**

## పొగడ్తలు మంచిది కాదు




పొగడ్తలు గిట్టని వారు, అతిగా పొగిడేవారిని దూరంగా పెట్టే అవకాశముంది. ప్రధాని నరేంద్ర మోడీని దేవదూతగా అభివర్ణించాడు వెంకయ్యనాయుడు. ప్రశంసలు హద్దు మీరకూడదు. మానవమాత్రులకు దైవస్థానం ఆపాదించకూడదు. రాజకీయ నాయకులు గొప్పనాయకులు కాగలరే గాని దేవుళ్లు, దేవదూతలు కాలేరు. ఇలాంటి పొగడ్తలు రాజకీయ ఆరోగ్యానికి అంత మంచిది కాదు.

*– కురుగూరు రంగనాథ్,* **నెల్లూరు.**

## మత పిచ్చి ముదురుతుంది

దేశంలో బహిరంగ మత ప్రచారాలను నిషేధించాల్సిన సమయం ఆసన్నమైంది. మత మార్పిళ్ల వ్యవహారాలు తరచూ ఇరు వర్గాల ప్రజల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. నేపాల్‌లో భూకంపం వచ్చి ప్రజలు అల్లాడుతుంటే ఓ మతం వారు అక్కడికెళ్లి మత ప్రచారాలకు దిగడం అత్యంత నీచంగా వుంది. అలాగే ఇతర మతాలవారికి చెందిన పవిత్ర క్షేత్రాలలో అన్యమత ప్రచారాలకు పాల్పడే వారిని నిలువునా పాతరేయాలి.

*– సి.రాజీవి,* **నెల్లూరు.**

# ఐఏఎస్ కమిషనర్ వచ్చేనా?

**నెల్లూరు నగరపాలక సంస్థకు తొలి ఐఏఎస్ కమిషనర్ చక్రధర్‌బాబు. ఇదొక గుర్తుంచుకోదగ్గ విషయమైతే, వచ్చిన ఆరునెలల్లోనే బదిలీ జరగడం మరో విశేషం. చక్రధర్‌బాబు బదిలీకి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లే! ఇందులో సందేహం లేదు. కమిషనర్‌గా చక్రధర్‌బాబు వచ్చాక నగరపాలక సంస్థలో సంఘర్షణ మొదలైంది. మేయర్‌కు కమిషనర్‌కు మధ్య ఆధిపత్యపోరు నడిచింది. కార్పొరేషన్‌లో ఎవరికి వాళ్ళు స్వతంత్రంగా వ్యవహరించాలని ముందుకు పోవడంతో మనస్పర్థలు తలెత్తడం, చివరకు రాజకీయ ఒత్తిడితో చక్రధర్‌బాబు సినిమాలలో జరిగినట్లుగా రంపచోడవరం అనే ఏజన్సీ ఏరియాకు బదిలీ కావడం జరిగింది.**

సరే, చక్రధర్‌బాబు వెళ్లిపోయాడు. ఆ స్థానంలో ఇంతవరకు ఎవరూ రాలేదు. రావడానికి కూడా సాహసించడం లేదు. డైరక్ట్ ఐఏఎస్ అధికారులు కాదు, పదోన్నతి ఐఏఎస్ అధికారులు కూడా ఈ పోస్టును కోరుకోరు. వాళ్ల దృష్టిలో నెల్లూరు నగరపాలక సంస్థ చాలా చిన్నది. అందునా ఇక్కడ మేయర్ పెత్తనం వుంటుంది. పోయిపోయి ఒక ఐఏఎస్ అధికారి మేయర్ కనుసన్నల్లో నడవడానికి అంగీకరించడు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ వంటి మెట్రోసిటీ కమిషనర్‌ల పరిస్థితి వేరు. నెల్లూరు పరిస్థితి వేరు. ఐఏఎస్‌లు సాధ్యమైనంతవరకు రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు అజమాయిషీలో పని చేయడానికి సిద్ధంగా ఉంటారు. ఐఏఎస్‌లకు అనుబంధం ఎక్కువగా ఉండే పరిపాలనా కేంద్రాలు ఇవే! అంతేగాని ఒక స్థానిక సంస్థ పరిధిలో స్థానిక పరిపాలకుల క్రింద పని చేయలేరు.

ప్రభుత్వం మాత్రం అన్ని కార్పొరేషన్‌లకు ఐఏఎస్ అధికారులనే కమిషనర్‌లుగా నియమించాలని గతంలోనే నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నెల్లూరుకు రెండో ఐఏఎస్ కమిషనర్‌గా ఎవరొస్తారనేది ఇంతవరకు తేలలేదు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అయిష్టంగానే నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ బాధ్యతలు చేపట్టి ఉన్నాడు. తొందరగా ఎవరో ఒకరు వస్తే బాధ్యతలు అప్పగించడానికి ఆయన సిద్ధంగా వున్నారు.

- **తిరుపతి, చెన్నై - నెల్లూరు మధ్య అభివృద్ధి కేంద్రాలు**



# నెల్లూరు వైపే పరిశ్రమల పరుగులు

*రానున్న పదేళ్లలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి తప్ప మరో అభివృద్ధి ఉండదు. ఆ అభివృద్ధికి ఆస్కారముండేది మాత్రం నెల్లూరు - చిత్తూరుజిల్లాల పరిధిలోనే. అభివృద్ధి పరంగా నెల్లూరుకు చంద్రబాబు మొండిచేయి చూపిస్తున్నా, పరిస్థితులు మాత్రం ఆయనకు ప్రతికూలంగా నెల్లూరుజిల్లాకు అనుకూలంగా ఉండబోతున్నాయి.*

గుంటూరు-కృష్ణాజిల్లాలు కేంద్రంగా చంద్రబాబు రాజధాని నిర్మాణం పెట్టుకున్నాడు. ఇక్కడ భూసేకరణతోనే తల బొప్పి కడుతుంది. భూసేకరణ సమస్య తేలేసరికే ఏళ్లు పట్టేటట్లుంది. రాజధాని నిర్మాణానికి కేంద్రం ముష్టి విదిల్చినట్లుగా నిధులిస్తుంది. చంద్రబాబు కలల రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే ఈ రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టుపెట్టాల్సిందే! కాబట్టి ఇప్పట్లో ఇక్కడ రాజధాని అయ్యేది లేదు. పెట్టేది లేదు. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కేంద్రం కొన్ని జాతీయ సంస్థలను మంజూరు చేసింది. అవి పూర్తి కావడానికే చాలా సమయం పట్టొచ్చు. అయితే అవి పూర్తయినా ఆ జిల్లాలకు ఒరిగేదేమీ లేదు. విశాఖపట్నంకు ఐటి ప్రాజెక్టులు వస్తున్నాయని ఆశిస్తున్నారు గాని, హైదరాబాద్, బెంగుళూరులను వదిలి ఐటి ప్రాజెక్టులు ఇక్కడకు వచ్చే అవకాశం ఎంత మాత్రం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వపరంగా జరిగే అభివృద్ధి తక్కువ. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రాజధాని మూలంగా వ్యవసాయ ప్రగతి కూడా కుంటుపడబోతుంది.

రాష్ట్రంలో అభివృద్ధి ఒక్క పారిశ్రామిక రంగంలోనే సాధ్యం కాబోతుంది. అది కూడా నెల్లూరుజిల్లా కేంద్రంగా పారిశ్రామికాభివృద్ధికి మార్గం సుగమం అయ్యింది. జిల్లాకు కృష్ణపట్నం పోర్టుతో పాటు 150కిలోమీటర్ల దూరంలో చెన్నై వంటి మహానగరం ఉండడం మనకు వరం కాబోతుంది. దీంతోపాటు దేశంలోనే విజయవంతమైన శ్రీసిటీ సెజ్ ఉండడం ప్లస్‌పాయింట్. హైదరాబాద్‌తో మనం మానసికంగా, భౌతికంగా విడిపోయాం. రాష్ట్రంలో హైదరాబాద్ స్థాయి కాదు కదా, దరిదాపుల్లోకి రాగల సిటీ ఒక్కటీ లేదు. పారిశ్రామికవేత్తలు, విదేశీ కంపెనీల ప్రతినిధులకు మెట్రోపాలిటన్ సిటీ ఎంతో అవసరం. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, రవాణా సదుపాయాలు కీలకం. రాష్ట్రంలో ఏ జిల్లాకు లేని విధంగా చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నెల్లూరుజిల్లాకు దగ్గరగా వుంది. ఇక కృష్ణపట్నం పోర్టు దేశంలోనే ఒకటిన్నరలక్షల టన్నుల సామర్థ్యంగల నౌకలు రావడానికి అనువైన పోర్టుగా వినుతికెక్కింది. కాబట్టే జపాన్, చైనాతో పాటు పలు విదేశీ కంపెనీలు కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ సెజ్‌లలో తమ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చాయి. ఇక చిత్తూరుజిల్లాలోని తిరుపతి, నెల్లూరుజిల్లాలోని నాయుడుపేటల మధ్య జాతీయ విద్యావైద్య సంస్థలు రాబోతున్నాయి.

రాబోయేకాలంలో రాష్ట్రాభివృద్ధిలో ఎక్కువ భాగం నెల్లూరు-తిరుపతి-చెన్నైల మధ్య త్రికోణం ఆకారంలా కేంద్రీకృతం కాబోతుంది.


# లాయర్

## ఆహ్వానము



*మహాశయా...*

గత మూడున్నర దశాబ్దాలుగా నెల్లూరీయుల ఆదరాభిమానాలతో అభివృద్ధిపథంలో పయనిస్తున్న మా(మీ) లాయర్ వారపత్రిక జిల్లా వాసులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువకావాలనే సంకల్పంతో జిల్లాలో మూడవ కార్యాలయాన్ని **"కావలి"** పట్టణంలో ప్రారంభించుకుంటోంది.

2015 మే 10వ తేదీ ఆదివారం ఉదయం 10.00 గంటలకు నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ **శ్రీ గజరావు భూపాల్,** ఐ.పి.యస్ గారు కావలి శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

ఈ వేడుకలో మీరూ పాల్గొని మా(మీ) లాయర్ ను ఆశీర్వదించవలసిందిగా ప్రార్థన.

సదా మీ సేవాభిలాషి

తుంగా శివప్రభాత్‌రెడ్డి

సంగ్రాహకులు

లాయర్
తెలుగు వారపత్రిక

**షాపు నెం.16, భావనాసి కాంప్లెక్స్,**
**గీతా మందిరం దగ్గర, రైల్వేరోడ్డు, కావలి టౌన్, నెల్లూరు జిల్లా - 524 201.**
**సెల్ : 76609 36137**

## మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డులో

# మొదలైన డ్రైనేజీ నిర్మాణం



ఆదివారం నెల్లూరు మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు సంయుక్తంగా శంకుస్థాపన చేసారు. ఈ డ్రైనేజీ నిర్మాణాన్ని ఎప్పుడో చేపట్టాల్సింది. చాలా లేట య్యింది. ఇక్కడ మెయిన్‌రోడ్డు పక్కన కాలువ పూడిపోయి వుంటుంది. దీంతో వర్షా కాలంలో నీళ్ళన్నీ రోడ్డుపై ప్రవహిస్తూ పక్కనేవున్న అండర్‌బ్రిడ్జిలోకి చేరుతుంటాయి. దీంతో బ్రిడ్జి వాటర్ షెడ్‌లాగా తయారై వాహనాల రాకపోకలన్నీ బంద్ అవుతుంటాయి. ఇటీవలే గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ డ్రైనేజీ నిర్మాణానికి చొరవచూపారు. అలాగే స్థానిక కార్పొరేటర్ దాసరి రాజేష్ దీనికోసం గట్టిగా ప్రయత్నించి మంజూరు చేయించారు. ఎట్టకేలకు డ్రైనేజీకి శంకుస్థాపన జరిగి పనులు మొదలయ్యాయి.

# పత్రికా స్వేచ్ఛపై దాడి

నెల్లూరులోని ఆంధ్రప్రభ పత్రిక కార్యాలయంపై దాడికి నిరసనగా ఏపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ ఆంధ్రప్రభ కార్యాలయంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీ గజరావుభూపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు నాయకులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరులో మాడరన్ కిడ్నీ సెంటర్



నెల్లూరులోని గాంధీ బొమ్మ సండేమార్కెట్ సమీపంలో డాక్టర్ పాబోలు సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాడరన్ కిడ్నీ సెంటర్‌ను డా॥ రామచంద్రారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ ఎస్.రవీంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డా॥ సురేంద్రకుమార్ మాట్లాడుతూ మణిపాల్, కోయంబత్తూరులలోని ప్రముఖ వైద్యశాలల్లో శిక్షణ పొంది మధురైలోని మీనాక్షి, మిషన్ హాస్పిటల్‌లో సేవలు అందించానన్నారు. నెల్లూరుజిల్లా వాసిగా స్థానిక ప్రజలకు సేవలందించాలన్న లక్ష్యంతో కిడ్నీకేర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. తమ హాస్పిటల్‌లో పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

ఈ కార్యక్రమంలో డా॥ పాబోలు స్వప్న, డా॥ పాబోలు వెంకటేశ్వరరావు, డా॥ పి.ఎల్.రావు, పాబోలు రామసుబ్బయ్య, డా॥ పి.మధుసూదనశాస్త్రి, డా॥ పి.భారతి, గౌరు నాగేశ్వరరావు, సింహపురి హాస్పిటల్స్ ఛైర్మెన్ రవీంద్రరెడ్డి, కొండా బలరామిరెడ్డి, బి.వి.నరసింహం, హోటల్ అతిథి గ్రాండ్ అధినేత యిమ్మడిశెట్టి సురేష్, శుభమస్తు వాసు, జె.ఎల్.సత్యం, బయ్యా ప్రసాద్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఇటీవల శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన తెలుగుదేశంపార్టీ ప్రోగ్రామ్ కమిటి ఛైర్మెన్ వి.వి.వి.చౌదరిని హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో కలసి మైసూర్‌పేట, శాలువాతో సత్కరిస్తున్న నెల్లూరుజిల్లా కాకతీయ సేవాసమితి అధ్యక్షులు రావి మోహన్‌చౌదరి

## నెల్లూరు కబుర్లు

# ఆర్టీసీ సమ్మెతో అగచాట్లు

మంగళవారం అర్ధరాత్రి నుండి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడంతో జిల్లాలోని అన్ని డిపోలలో బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమ్మె గురించి ముందే సమాచారం అందడంతో ప్రయాణీకులు ప్రైవేట్ బస్సులను, రైళ్లను ఆశ్రయించారు. సమ్మె గురించి తెలియక దూర భార ప్రాంతాల నుండి వచ్చినవాళ్ళు తెగ ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఈ వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు, పెద్దలకు ఆర్టీసీ సమ్మె అవరోధంగా మారింది. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తగిన సంఖ్యలో ప్రైవేట్ బస్సులు లేకపోవడంతో రైళ్లకు, ప్రైవేట్ ట్యాక్సీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. వచ్చిందే సందనుకుని ప్రైవేట్ ట్రావెల్స్ వారు ప్రయాణీకుల నుండి పెద్దమొత్తంలో ఛార్జీలు గుంజుకుంటున్నారు.

## ట్రాఫిక్ సెంటర్లను పరిశీలించిన ఎస్పీ



నెల్లూరు నగరంలోని పలు ట్రాఫిక్ సెంటర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ ఈ నెల 2వ తేదీ పరిశీలించారు. ట్రాఫిక్ సిఐ మాధవరావుతో కలిసి ఆత్మకూరు బస్టాండు, కనకమహల్‌సెంటర్, గాంధీబొమ్మ, విఆర్సీ సెంటర్ తదితర ట్రాఫిక్ సెంటర్లలో పర్యటించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై చర్చించారు. అనంతరం రెండవనగర పోలీసుస్టేషన్, సిసిఎస్, అయిదవ నగర పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు.

# భారీగా సమ్మర్ క్యాంప్‌లు

వేసవి సెలవుల నేపథ్యంలో నెల్లూరు నగరంలో పెద్దఎత్తున సమ్మర్‌క్యాంప్‌లను ఏర్పాటు చేసారు. విద్యార్థులకు వేసవి సెలవులు 40 నుండి 50రోజుల దాకా ఉంటాయి. కొందరు ఈ సెలవుల్లో విహారయాత్రలు ప్లాన్ చేసుకుంటారు. చాలామంది ఈ సెలవులను ఏదో ఒక రంగంలో శిక్షణ కోసం ఉపయోగించుకుంటారు. స్విమ్మింగ్, ఫుట్‌బాల్, కరాటే, వాలీబాల్, క్రికెట్, సంగీతం, నృత్యం, చెస్, క్యారమ్స్, చిత్రలేఖనం వంటి క్రీడలు, కళలలో విద్యార్థులకు తర్ఫీదునిచ్చేందుకు నెల్లూరు నగరంలో కొందరు కొంత ఫీజు వసూలు చేస్తూ సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తుండగా కొన్ని స్వచ్ఛంధ సంస్థలు ఉచితంగా సమ్మర్‌క్యాంప్‌లను నిర్వహిస్తుండడం విశేషం.



### కందుకూరు మునిసిపల్

## అబ్జర్వర్‌గా శ్రీనివాసయాదవ్

ప్రకాశంజిల్లా కందుకూరు మునిసిపల్, పార్టీ కమిటీల ఎన్నికలకు అబ్జర్వర్‌గా నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించిన వైయస్సార్సీపి కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌ను పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆమోదం మేరకు నియమించారు.

## 54డివిజన్లలో శానిటేషన్ వర్కర్ల కేటాయింపు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54డివిజన్లలో పారిశుద్ధ్యం మెరుగుకు శానిటేషన్ వర్కర్లను కేటాయించారు. ఒక్కో డివిజన్‌కు ఒక మేస్త్రీ, 20మంది వర్కర్లను ఇచ్చారు. రెండు, మూడు డివిజన్లకు ఒక శానిటరి ఇన్‌స్పెక్టర్ ఉంటారు. గతంలో 54డివిజన్లకు 20శానిటరీ డివిజన్లు ఉండేవి. ఈ డివిజన్లన్నింటికీ 12మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 8మంది మేస్త్రీలు ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించేవారు. మంగళవారం నుంచి కేటాయించిన విధంగా శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

# దుకాణాల గొడవ

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో కొత్తగా కార్పొరేషన్ వాళ్లు 9దుకాణాలు నిర్మించారు. అయితే వీటిని బాడుగకు ఇవ్వడానికి వేలంపాట పెట్టినప్పుడల్లా గొడవలు జరుగుతున్నాయి. నగరానికి చెందిన పెద్దపెద్ద నాయకులు కూడా ఈ దుకాణాల వేలంలో తలదూరుస్తున్నారు. వ్యాపారానికి మంచి సెంటర్ కావడంతో ఈ దుకాణాలకు డిమాండ్ పెరిగింది. ఎవరికి వాళ్లు వేలంలో దుకాణాలను చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో వేలం సాగడం కష్టంగా వుంది.

## పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌టెస్ట్

ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలలో ప్రవేశానికి ఈ నెల 29వ తేదీన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ మరియు పాలిసెట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ టి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, ఆసక్తి కలవారు ఈ నెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని, హాల్‌టిక్కెట్లను ఇంటర్నెట్‌లో పొందవచ్చునని తెలిపారు. 120మార్కులకు నిర్వహించే పరీక్షలో కనీసం 36మార్కులు సాధించాలని, పాసైన వారికి మాత్రమే ఫీజు మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

# రచనలకు ఆహ్వానం

ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సోమిరెడ్డి జమున స్మారక పురస్కారాల కోసం 2013, 2014లో ప్రచురితమైన నానీల కవితా సంపుటాలు, నవలలు 4 ప్రతులను ఈ పురస్కారాల కోసం జులై 30వ తేదీలోగా తమకు చేరేలా పంపాలని, ఉత్తమ రచనలకు రూ.5 వేల నగదుతో పాటు పురస్కారాలను ప్రదానం చేస్తారని పెరసం ప్రధాన కార్యదర్శి జి.సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రచనలు పంపాల్సిన చిరునామా : డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, వంశీ క్లినిక్, ఇందిరాభవన్ రోడ్, విజయమహల్ గేటు వద్ద, నెల్లూరు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.9440279594ను సంప్రదించాల్సిందిగా కోరారు.

## ఎండలు బాబోయ్... ఎండలు

భానుడి ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. ఉదయం 7గంటల నుంచే ఎండతీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. గత వారంరోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు బెంబేలెత్తుతున్నారు. వడ దెబ్బకు జిల్లాలో అక్కడక్కడ వృద్ధులు మరణిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటూనే వున్నాయి. వడదెబ్బకు ఎవరూ మరణించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సిఉంది.

### స్పెషల్ బ్రాంచ్‌కు

## సబ్‌డివిజన్‌లు

జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌కు ఐదు సబ్‌డివిజన్‌లను కేటాయించారు. వాటిలో నాలుగు సబ్‌డివిజన్‌లకు ఎస్‌ఐలను కేటాయించారు. నెల్లూరు సబ్‌డివిజన్‌కు కె.వి.నారాయణ, నెల్లూరురూరల్ సబ్ డివిజన్‌కు శ్రీనివాసులురెడ్డి, గూడూరు సబ్‌డివిజన్‌కు నాగరాజు, కావలి సబ్‌డివిజన్‌కు మల్లిఖార్జున్‌లను ఎస్‌ఐలుగా నియమించారు. ఆత్మకూరు సబ్‌డివిజన్‌కు మాత్రం ఇంకా ఎవరినీ నియమించలేదు.

## దువ్వూరుకు రాష్ట్రపదవి

కృష్ణపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మెన్ దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియమించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సహకారంతో ఆయనను ఈ పదవి వరించింది.

## కామాక్షమ్మ బ్రహ్మోత్సవాలు

జొన్నవాడ కామాక్షమ్మ తల్లి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 9న ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగనున్నాయి. 9న అంకురార్పణ, 10న ధ్వజారోహణ, 11న శేషవాహనం, 12న పురుషామృగవాహనం, 13న సింహవాహనం, 14న హంసవాహనం, 15న రావణసేవ, 16న వెండి నంది సేవ, 17న రథోత్సవం, 18న కళ్యాణోత్సవం, 19న ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

# కాలంతో పాటు మారుతున్న కావలి

## కావలి కబుర్లు

*కావలి అంటే... విద్యాసంస్థలు, వస్త్ర వ్యాపారం గుర్తుకొస్తాయి. చెక్కుచెదరని బొంతరాళ్ల భవనాలు, తల్లి కలుగోళ శాంభవి ఆలయం, ప్రాచీన శివాలయం, విశిష్టమైన జవహర్‌భారతి విద్యాసంస్థలు మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. నెల్లూరు జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాల్లో కావలి ఒకటి. ఇది మండల కేంద్రం కూడా!*

ఆలోచించి చూస్తే, కావలి అన్న పేరు ఇతర గ్రామాలకు భిన్నంగా కన్పిస్తుంది. క్రీ.శ. 1515లో విజయనగర సామ్రాజ్యాన్ని ఏలిన హరిహరరాయలు ఉదయగిరిని జయించి తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. శ్రీ కృష్ణదేవరాయలు రాజయ్యే నాటికి కావలి కేంద్రంగా అక్కడ సముద్ర తీరానికి సరుకులు రవాణా అవుతుండేవి. నేటి తుమ్మలపెంట, ఇస్కపల్లి, చెన్నారాయునిపాళెంలకు సరుకులను కావలి నుంచి తరలించే వారు. ఇది గమనించిన కృష్ణరాయలు రక్షక భటులస్థానే ఒక సైనిక శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. కుంకుళ్లు, తేనె ఉదయగిరి నుంచి రవాణా నిమిత్తం కావలికి వచ్చేవి. రాను రాను దొంగల బెడద ఎక్కువయింది. సాయుధులైన కాపలాదారులు అవసరం అయ్యారు. దీంతో కావలి వారుగా చాలా మంది జీవితంలో స్థిరపడ్డారు. అందుకే ఈ ప్రాంతానికి కావలి అనే పేరు వచ్చింది.

కావలి కంటే ముందు జనావాసం సర్వాయపాళెం. 1515 తర్వాత కావలి దాని నుండి విడివడి కాలక్రమేణా పెద్ద పట్టణం అయింది. కావలిలో కన్పించే ప్రాచీన చారిత్రక సాక్ష్యం శివాలయం. ఇందులో దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వెలసి వున్నాడు. ఇందులో విజయనగరాన్ని ఏలిన తుళువంశం ప్రభువులకాలం నాటి శాసనం వుంది. ఉదయగిరిని జయించాక హరిహరరాయులు సముద్రస్నానానికి వెళుతూ స్వామి వారిని దర్శించుకున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ ఆలయానికి ఈతముక్కల, దొడ్ల, కనవరాజు వంశీయులు ధర్మ కర్తలుగా వుంటున్నారు. అప్పట్లో ఈ ఆలయం నిర్మించడానికి కుంభకోణం నుంచి శిల్పులు వచ్చారు. 250 ఏళ్ల కిందట కేతిరెడ్డి వంశీయులు ఆలయానికి జీర్ణోద్ధారణ గావించారు.

ఈ ఆలయాన్ని ఇందిరాగాంధీ దర్శించారు. ఆలయంలో రాహు కాలంలో ప్రతి శుక్రవారం పూజలు జరిపితే అవివాహితులకు వివాహం అవుతుందని నమ్మకం. శివలింగానికి ఎదురుగా వున్న తిరుగుడు నందిని పక్కకు తిప్పితే గర్భిణీస్త్రీలకు కాన్పు తేలికవుతుందని విశ్వాసం.




**వస్త్ర వ్యాపారంలో** కావలిని రెండో బొంబాయి అంటారు. దాదాపు ఐదు వందల మంది హోల్‌సేల్, రిటైల్ వస్త్ర దుకాణాలు వ్యాపార లావాదేవీలు సాగిస్తుంటాయి. అన్నపూర్ణ, అరుణోదయ, నవోదయ, శుభోదయ వస్త్ర మార్కెట్లు ప్రజల్ని ఆకర్షిస్తుంటాయి. అంతేగాకుండా రెడీమేడ్ తయారీలో గార్మెంట్స్ రంగం ప్రత్యేకతతో కొనసాగుతోంది. పేదవాడికి, ధనవంతుడికి సైతం అందుబాటులో వుండే విధంగా ఇక్కడ వస్త్రాలు దొరుకుతాయి. ముంబాయి, సూరత్, అహ్మదాబాద్ లాంటి అనేక ప్రాంతాల నుంచి వస్త్రాలను తెచ్చి, ఇక్కడ అమ్ముతుంటారు. ఎంతో మంది ఈ దుకాణాల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

కావలికి సమీపాన వున్న ముసునూరును అప్పట్లో మొసళ్లూరు అనే వారని అంటారు. అప్పట్లో మొసళ్లవాగు వుండేదని, వాగు ఉధృతిగా ప్రవహిస్తున్నప్పుడు ఒకసారి ఈ దారిన పోతూవున్న తెనాలి రామలింగని ప్రయాణం నాలుగురోజులపాటు ఆగిందని, అప్పుడాయన మొసళ్ల వాగు మీద పద్యాలు చెప్పాడని అంటారు. కావలికి సమీపాన మరో ప్రసిద్ధ గ్రామం గౌరవరం. గౌరమాంబ పేరు మీద ఈ గ్రామం ఏర్పడింది. ఈమె ఉదయగిరినేలిన గజపతుల ఇంటి ఆడపడుచు, బ్రహ్మచారిణి. ఈమె శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తురాలు. తన జీవితాన్ని స్వామి సేవకే అంకితం చేసిన మహనీయురాలు. కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరాలయం ఈమె ఆదరణలో అభివృద్ధి చెందింది. 'గౌరమాంబదేవి మెడ' లేదా 'గుహ' ఈ ప్రాంతంలో చూడవచ్చు.

కాగా, కావలి గ్రామదేవత కలుగోళ శాంభవి. ఆమె పుట్టిల్లు సర్వాయ పాళెం. ఈ గ్రామంలో ఒక ధాన్యపు గాదెలో కళుగోళ శాంభవి స్వయంభువుగా అవతరించింది. తనకు కోడికూత, రోకటి పోటు వినిపించని ప్రదేశంలో ఆలయం నిర్మించమని కోరింది. ఆ ప్రకారమే కలుగోళమ్మ ఆలయం కట్టారు. ఇప్పుడు ఈ ప్రాంతం పెద్ద నివాస ప్రాంతం. ఊరిలోని బావులన్నీ ఎండినా ఈ ఆలయంలోని బావి ఎండదని అంటారు. ఇదొక గొప్ప విశేషం. కలుగోళమ్మ దర్శనం కష్టాలను దూరంచేసి, శుభాలను కలుగచేస్తుందని భక్తుల నమ్మకం.

కావలి గార్మెంట్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. కందుకూరి గార్మెంట్స్, మార్కెట్ గార్మెంట్స్, మోడరన్ ఫ్యాషన్ గార్మెంట్స్, బాంబే గార్మెంట్స్, కోణార్క్ గార్మెంట్స్ మొదలైనవి రెడీమేడ్ దుస్తుల తయారీలో ప్రఖ్యాతిగాంచాయి. ఈ గార్మెంట్స్ వల్ల ఎక్కువ మంది మహిళలకు జీవనోపాధి లభిస్తున్నది.

వస్త్ర వ్యాపారులు సాంఘిక, సంక్షేమ, సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారు. 1996లో వచ్చిన వరద బాధితుల్ని ఆదుకున్నారు. కళ్యాణ మండపాలు నిర్మించారు. స్వీయనిధులతో సేవలతో వ్యాపారులు ప్రజల మన్ననలందుకుంటున్నారు.

అభ్యుదయ భావాల పుట్టినిల్లు కావలి. కె.వి.రమణారెడ్డి, భుజంగరాయశర్మ... లాంటి వారెందరో... కవులకు ఇది జన్మస్థలం.

తెలుగు సినీ రంగంలో సాటిలేని మేటి నటులు రాజనాల, నాగభూషణం గార్లు ఈవూరి వారే! ఇక విద్యారంగానికొస్తే 1922లోనే కావలిలో మద్రాసు గవర్నమెంట్ తొలి ఉన్నత పాఠశాల ఏర్పడింది. అది నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. దొడ్ల రామచంద్రారెడ్డి గారి పుణ్యం విశ్వోదయ (మిగతా 10వ పేజీలో)

శుభాకాంక్షలు

గత మూడున్నర దశాబ్దాలుగా స్థానిక సమాచారానికి సారథిగా
ప్రజలకి, ప్రభుత్వాలకి మధ్య వారధిగా విజయప్రస్థానంలో దూసుకుపోతున్న
లాయర్
తెలుగు వారపత్రిక
నేడు మరో అడుగు ముందుకేస్తూ...
**కావలి** శాఖను ఏర్పాటు చేసుకుంటున్న శుభతరుణంలో
నా హృదయపూర్వక శుభాకాంక్షలు.




**వంటేరు వేణుగోపాలరెడ్డి**
**మాజీశాసనసభ్యులు, కావలి.**

# కావలికి నీళ్ళ కొరత తీర్చనున్న కాలువ ఆధునీకరణ

## - మంత్రులు దేవినేని ఉమ, డా. పి. నారాయణ

ఎట్టకేలకు కావలి కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఈ పనుల ప్రారంభోత్సవంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమ, జిల్లాకు చెందిన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పి నారాయణ, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి, వెంకటగిరి ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కురుగొండ్ల రామకృష్ణలతో కలసి ఈ పనులకు భూమి పూజ చేశారు. ఆదివారం జలదంకి మండలంలోని చిన క్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి దేవినేని మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.400 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి నిధుల కొరత లేదని, ఎన్ని కోట్లైనా సరే.. నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా వున్నామని ఆయన అన్నారు. ఆధునీకరణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేయాలన్నారు. సాగునీటికి సంబంధించి అవసరమైన పనులకు అనుమతుల కోసం ఎవరి చుట్టూతా తిరగాల్సిన అవసరం లేదని, అధికారులు ఎక్కడ ఏది అవసరమో గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే ఆ పనులకు సత్వరం అనుమతిని మంజూరు చేస్తామని ఆయన అన్నారు. గోదావరి జలాలను కృష్ణానదికి తరలించే ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తిచేస్తామని, కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీకి వచ్చే గోదావరి జలాలను శ్రీశైలం, గాలేరు-నగరి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల ద్వారా రాయలసీమ, నెల్లూరుజిల్లాల రైతాంగానికి అవసరమైన సాగునీటి జలాలను పుష్కలంగా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం లోటు బడ్జెట్ వున్నా సాగునీటికి కొరత లేకుండా పలుప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తక్కువ వ్యయంతో ఎక్కువ ప్రయోజనం కలిగించే సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి అన్నదాతలందరినీ ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రూ 228 కోట్లతో కావలి కాలువ ఆధునీకరణ పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, తొలిదశలో రూ.24కోట్లతో కాలువ పనులు పూర్తయ్యాయని, మూడు నెలల్లోగా కావలి కాలువ మొదటిదశ పనులు పూర్తవుతాయని తెలిపారు. 67 కిలోమీటర్ల కావలి కాలువ ఆధునీకరణకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. కావలి కాలువ చివరి ఆయకట్టు భూములకు కూడా సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపట్టామన్నారు. కావలి కాలువ ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందాల్సివుందని, ప్రస్తుతం ఈ కాలువ ద్వారా 60 వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతోందని అంటూ, మొదటి విడతగా రూ.24 కోట్లు ఖర్చుచేస్తే 40 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందుతుందని ఆయన వివరించారు. జిల్లాలో సగటు వర్షపాతం 1030 మి.మీలు కాగా, ఈ ఏడాది ఇప్పటిదాకా 598 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైందన్నారు. అయినప్పటికీ అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుని, అధికశాతం పంటలు పండేలా చూశారన్నారు. ముందస్తు ప్రణాళికతో కావలి కాలువ ఆయకట్టు భూములకు నీటిని సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతమయ్యారని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా టిడిపి అధ్యక్షుడు బీదా రవిచంద్రతో పాటు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, కావలి ఆర్డీఓ ఎంఎల్ నరసింహం, సోమశిల సిఇ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## కళుగోళమ్మ తల్లికి లక్ష మల్లెలతో పూజ

కావలి పట్టణంలో వెలసివున్న చల్లనితల్లి, భక్తుల కొంగుబంగారమైన కళుగోళమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 3వ తేదిన విశేష పూజలు జరిగాయి. వైశాఖ మాసం పూర్ణిమ సందర్భంగా అమ్మవారికి 108 మంది ముత్తయిదువులతో లక్ష మల్లెలతో అర్చనలు, పూజలు జరిపారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అందరినీ కాపాడే చల్లనితల్లి కళుగోళమ్మ అనీ, ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటూ తాము అమ్మవారిని ప్రార్థించి పూజలు చేశామని భక్తులు ఈ సందర్భంగా తెలియజేశారు.


వాస్తవాల వార్తా వేదిక, నెల్లూరీయుల గుండెదీపిక
పత్రికా ప్రపంచానికే అమూల్య కానుక
లాయర్
తెలుగు వారపత్రిక
కావలిలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా
అభినందనలతో...

నలుబోలు బలరామయ్యనాయుడు
ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మన్, నెల్లూరు

శుభాకాంక్షలు
అక్షరాలే ఆయుధంగా
నిజాలే యిజంగా
నిరంతరం కలంతో
యజ్ఞంచేసే
లాయర్ వారపత్రిక
కావలి కార్యాలయ
ప్రారంభోత్సవం
సందర్భంగా
మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.
కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి
కాంట్రాక్టర్
కావలి.

పాఠక ప్రపంచానికి మరో కానుకగా కావలి లోగిలిలో తమ శాఖను ప్రారంభించుకుంటున్న
లాయర్ వారపత్రిక సారథికి శుభాకాంక్షలతో...
GREAVES
SINCE 1859
Greaves Cotton Limited
GREAVESPART

అసలైన స్పేర్‌పార్ట్స్‌తో శుభప్రదం
వాహనదారుల విజయపథం...
గ్రీవ్స్ వారి అసలైన పార్ట్స్ & ఆయిల్ వాడండి
ఇంజన్ నుండి గొప్ప పనితనం పొందండి



శ్రీ శివసాయి ఏజెన్సీస్
(ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్: గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్)
జి-12, ఎస్.వి.ఎస్. కాంప్లెక్స్, ఆచారి వీధి, వాహబ్‌పేట్, నెల్లూరు - 524 003.
ఫోన్: 0861 - 2348807, 94402 76268.
డి.హేమంత్‌కుమార్

శుభాకాంక్షలు
పత్రికా ఆకాశంలో
ప్రకాశించే అక్షర తార,
నిష్పాక్షిక వార్తలను
వర్షించే అమృతధార
లాయర్ వారపత్రిక
కావలి కార్యాలయ
ప్రారంభోత్సవం
సందర్భంగా
మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.
కుందుర్తి కామయ్య
కౌన్సిలర్
కావలి పురపాలక సంఘం

# ‘కలికి’ తురాయికి జన ఘన నివాళి !

జననేత, మాజీ మంత్రివర్యులు కలికి యానాదిరెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, ప్రజలు వేల సంఖ్యలో పాల్గొని, తమ ప్రియతమ నాయకునికి ఘననివాళులర్పించారు. ఈ నెల 5వ తేదీ కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో కలికి యానాదిరెడ్డి వరుసకు అల్లుడైన కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి సారథ్యంలో కలికి అభిమానులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఒక చిన్న మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన కలికి యానాదిరెడ్డి గ్రామ సర్పంచ్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ, చివరకు మంత్రి పదవిని సాధించుకున్నారంటే అందుకు ఆయన్ను ప్రేమించిన ప్రజల ఆదరాభిమానాలే కారణం. కలికి యానాదిరెడ్డి భౌతికంగా మరణించినా ఇప్పటికీ ఆయన పేరు కావలిలో నిత్యం ఏదో ఒక చోట, ఏదో ఒక రూపంలో వినిపిస్తూనే ఉంటుంది. ప్రజల అండదండలు ఉంటే రాజకీయాలలో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన వేళ్ళ మీద లెక్కింపదగిన అతి కొద్దిమంది రాజకీయ నాయకులలో కలికి కూడా ఒకరు. నేటి తరం రాజకీయ నాయకులకు ఆయన ఓ మార్గదర్శి. ఇప్పటికీ ఆయన వర్ధంతి కార్యక్రమానికి వేలసంఖ్యలో అభిమానులు హాజరై ఇలా నివాళులు అర్పించుకుంటున్నారంటే – ప్రజల హృదయాల్లో ఆయన చోటు ఎలాంటిదో చెప్పకనే చెపుతుంది. కావలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి కంకణం కట్టుకొని, అసాధ్యమైన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కావలిలో నిర్మింపచేసిన అపర భగీరథుడు ఆయన. కలికి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ముఖ్యంగా ధన రాజకీయం కేవలం కొద్ది కాలమే మనగలుగుతుందన్న సత్యాన్ని కలికి సేవల ద్వారా గ్రహించాలి. గెలుపు, ఓటమి పక్కన పెట్టి ప్రజాబలాన్ని కూడగట్టడానికి కలికిలాంటి నాయకులు దశాబ్దాల కాలం ప్రజలకు ఎలా సేవలందించారో, మరణించినా ప్రజల నీరాజనాలు ఎందుకు అందుకుంటున్నారో ఈ నాయకులు తెలుసుకోవాలి. వర్ధంతి సభలో పాల్గొన్న నాయకులు కలికిని పొగడ్తలతో ముంచెత్తడం కాదు కావాల్సింది. ఆయన రాజకీయ జీవితాన్ని ప్రజలకు చేరువ కావడానికి అందించిన సేవలు అధ్యయనం చేయాలి. సామాన్య రైతు కుటుంబంలో జన్మించినా ప్రజల ఆదరాభిమానాలు ఉంటే అసాధ్యం అన్న పదాన్ని సుసాధ్యం చేసుకోవడం ఎలా అని లోకానికి చాటిన కలికి ఆదర్శాలలో 5శాతం నేటి తరం నాయకులు పాటించినా ప్రజల హృదయాలలో తప్పక చోటు సంపాదించుకోగలరు. పదవులలో ఉన్నప్పుడే కాకుండా పదవులు లేనప్పుడు కూడా ప్రజాసేవలో నిమగ్నమైనవాళ్ళే చాలాకాలం నాయకులుగా కొనసాగగలరనడానికి కూడా కలికి ప్రత్యక్షసాక్షి.

## యానాదిరెడ్డి 9వ వర్ధంతి



## కలికి ఆశయబాటలో పయనిద్దాం !

స్వర్గీయ కలికి యానాదిరెడ్డి ఆశయసాధనకు సమిష్టిగా కృషిచేసి కావలి నియోజకవర్గ అభివృద్ధికి దోహదం చేయాలని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాపరెడ్డి ప్రజలను కోరారు. కావలి ప్రజలకు కలికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయబాటలో ప్రతిఒక్కరూ పయనించాలన్నారు. యానాదిరెడ్డి నేడు మన మధ్య లేకున్నా ప్రజల హృదయాలను దోచుకున్న నిజమైన జననేత అని కీర్తించారు.

## కావలి ‘దేశం’కు కొత్త సైన్యం

కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యవర్గాన్ని విస్తరిస్తూ మరికొంతమందికి కార్యవర్గంలో చోటు కల్పించారు. ఆ మేరకు బుధవారం మొత్తం 45 మందితో కార్యవర్గం ఏర్పాటుచేస్తూ ఆ పార్టీ నేతలు జాబితా విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా వెంకటప్రసాద్, హజరత్, భారతి, మల్లారెడ్డి, వెంకట్రావు నియమితులయ్యారు. అదేవిధంగా, సమన్వయ కార్యదర్శిగా రమణయ్య, అధికార ప్రతినిధులుగా వెంకటేశ్వరనాయుడు, గుండ్లపల్లి శివాజీ, ప్రచార కార్యదర్శులుగా గుండ్లపల్లి మురళీయాదవ్, ప్రళయకావేరి కృష్ణ, కోశాధికారిగా రామ్మోహనరావు నియమితులయ్యారు. పార్టీ అనుబంధ సంఘాల కమిటీల కార్యవర్గంలో భాగంగా, తెలుగు యువత అధ్యక్షునిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కిషోర్ నియమితులయ్యారు. తెలుగు రైతు విభాగానికి విజయభాస్కరరెడ్డి, సుధాకర్‌లను నియమించారు. ఎస్సీ విభాగానికి వేగూరు చంద్రశేఖర్, మైనంపాటి జగదీష్, ఎస్‌టి విభాగానికి కూరపాటి శ్రీనివాసులు, డి.సురేష్, వాణిజ్య విభాగానికి రవ్వా సుబ్బారావు, పాదర్తి నాగరాజు నియమితులయ్యారు. మైనార్టీ విభాగానికి కరీముల్లా, ఎం.రాజు, లీగల్ సెల్ విభాగానికి మధుసూదనరావు, సురేష్‌కుమార్, సాంస్కృతిక విభాగానికి రామచంద్రరావు, దేవ ప్రసన్నరాజు, టిఎన్‌టియుసి విభాగానికి కోటిలింగాచారి, మన్నార్ నియమితులయ్యారు. టిఎన్ఎస్ఎఫ్ విభాగానికి పూర్ణచంద్రరావు, లోకేష్‌లు నియమితులయ్యారు.

## ఆగిన బస్సులు...
## సాగని పనులు!

ఆర్టీసీ కార్మికుల సమ్మె సామాన్య జనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కావలి పట్టణంలో వ్యాపారాల మీద ఈ ప్రభావం గణనీయంగా పడింది. కావలి డిపోకు ఆదాయం పడిపోవడంతో పాటు ప్రయాణీకుల అవస్థలు అన్ని ఇన్నీ కావు.

కావలి డిపో నుండి ప్రతిరోజూ హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, చెన్నై, తిరుపతి, తిరుమల, కడప, కర్నూలు, అనంతపురం వంటి దూరప్రాంతాల సర్వీసులు నడుస్తుంటాయి. కావలి డివిజన్ పరిధిలో అల్లూరు, దగదర్తి, బోగోలు, జలదంకి, ప్రకాశంజిల్లాలోని గుడ్లూరు మండలాలకు చెందిన ప్రయాణీకులు పైప్రాంతాలకు పోవాలంటే కావలి బస్సులనే ఆశ్రయిస్తుంటారు. ఆర్టీసీ సమ్మెతో ఈ బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణీకులకు అవస్థలు తప్పడం లేదు.

అలాగే ఒంగోలు, నెల్లూరు, అల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరి, దగదర్తి, కొండాపురం, కందుకూరు, ఏ.యస్.పేట రూట్లలో కావలి డిపో నుండి ట్రిప్పుల సర్వీసులు తిరుగుతుంటాయి. ఆయా గ్రామాలకు కావలి పట్టణానికి మధ్య వ్యాపార అనుసంధానంగా నిలిచేది ఆర్టీసీ బస్సులే! ఆయా గ్రామాల్లో వ్యాపారులు ఉదయాన్నే కావలికి రావడం, హోల్‌సేల్‌గా సరుకులు కొని గ్రామాలకు పోవడం చేస్తుంటారు. దీనివలన కావలి పట్టణంలో నిత్యం వ్యాపారం బాగా జరుగుతుంటుంది. బస్సులు నిలిచిపోవడంతో ఈ వ్యాపార లావాదేవీలు కొంతవరకు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా బస్సులు లేకపోవడంతో ఈ రూట్లలో ఆటోలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి.

శుభాకాంక్షలు

34ఏళ్ళ నెల్లూరు జిల్లా ముద్దుల పుత్రిక
లాయర్ తెలుగు వారపత్రిక
కావలి పట్టణంలో తమ శాఖను ప్రారంభించుకుంటున్న
శుభసందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు.

కనుమర్లపూడి వెంకటనారాయణ
కౌన్సిలర్ మరియు వైయస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్
కావలి పురపాలక సంఘం

మూడున్నర దశాబ్దాల పత్రికా రంగ చరిత్రలో
నిష్పాక్షిక వార్తల పైరును పండిస్తూ..
అక్రమాల కలుపు మొక్కలను ఏరివేస్తూ...
రాజమార్గంలో నడుస్తూ... నేడు కావలి పట్టణంలో
నూతన శాఖ ద్వారా అడుగిడుతున్న
లాయర్ వారపత్రికకు
శుభాకాంక్షలు.





వీరిశెట్టి హాజరత్‌బాబు
ప్రొప్రైటర్

పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
ఈ మండు వేసవిలో నెల్లూరీయుల కోసం సరికొత్త రుచులతో ఎన్నో వెరైటీ ఐస్‌క్రీమ్స్



॥ బ్లూబెర్రీ ॥ రసబెర్రీ ॥ ఫారెస్ట్ ఫ్రూట్ ॥ అంజీర్‌బాదమ్ ॥ అమెరికన్ డ్రైఫ్రూట్
॥ క్యారమల్ నట్ ॥ నట్టీ డిలైట్ ॥ ఫ్రూట్ పంచ్ ॥ కాజూ కిస్‌మిస్

శుభాకాంక్షలు

నిరంతరం ప్రవహించే వార్తాప్రవాహం
ప్రతి మదిని అలరించే అక్షర విన్యాసం
లాయర్ వారపత్రిక
కావలిలో తన శాఖను ఏర్పాటు చేసుకుంటున్న
శుభసందర్భంగా మా శుభాకాంక్షలు.

చెన్నా వెంకటరామయ్య
ప్రొప్రైటర్

బాలాజీ ఫర్నిచర్
దేవి థియేటర్‌రోడ్డు, కావలి.

# మారుతున్న కావలి

(7వ పేజీ తరువాయి)

విద్యాసంస్థలు వీటి అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడినవారు పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి, ఎం.రామానుజ నాయుడు, ఎస్.వి. భజంగరాయశర్మలు.

జవహర్‌లాల్ నెహ్రూ వుండగానే దొడ్ల రామచంద్రారెడ్డిగారు విద్యా సంస్థలకు, నెహ్రూ పేరు పెట్టాలని వుందని అడిగితే ఆయన అంగీకరిం చలేదు. ఆయన చని పోయాక 1965లో ఆనాటి రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ జవహర్ భారతి విద్యా సంస్థలుగా వాటిని ప్రకటించారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన వారు దేశవిదే శాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సాధిం చారు. దేశంలో పేరెన్నికగన్న 120 కళాశాలల్లో జవహర్ భారతి ఒకటి. ఈ మండలంలో అన్నగారిపాళెంకు ఒక ప్రత్యేకత వుంది. ఈ ఊరి గ్రామ దేవత "ముందరపొట్టెమ్మ". ఈ గ్రామానికి సమీపంలో తాళ్ళపాళెంలో దాదాపు నూరేళ్ళ క్రిందట సామంతురెడ్ల ఇంట్లో ధాన్యాగారంలో ఈ గ్రామ దేవత ప్రత్యక్ష మైంది. ఆ కుటుంబసభ్యులే ముందర పొట్టెమ్మకు గుడి నిర్మించారు.

ఆరోజు నుంచి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. పొలాల్లో ఎన్ని మందులు వాడినా, రసాయన ఎరువులు వేసినా తొలగని చీడ పీడలు, పెరగని భూసారం దేవత పాదాల చెంతనున్న ఇసుకను పొలాలలో చల్లుకుంటే పోతాయని ఇక్కడి వారి నమ్మకం. అలాగే ఆ ఇసుక చల్లడంతో భూసారం పెరిగి ఆ పొలాల్లో ఊహించని దిగుబడులు వస్తాయని ప్రగాఢ విశ్వాసం.

ప్రతి సంవత్సరం వ్యవసాయ సీజన్‌లో స్థానిక గ్రామాల ప్రజలే కాక, ప్రకాశం జిల్లా నుంచి కూడా రైతులు ఇక్కడికి వచ్చి గ్రామదేవతకు ప్రణమిల్లి తమ పంటలు బాగా పండాలని కోరుకుంటూ వుంటారు. వారి పంట దిగుబడుల కోసం ఆయా ప్రాంతాల ప్రజలు బస్తాల్లో ధాన్యం తెచ్చి, అదే పరిమాణంలో ఆ దేవత పాదాల చెంత ఉన్న ఇసుకను తీసుకెళ్ళి పొలాల్లో చల్లుకుంటూ వుంటారు.

ప్రతి ఆదివారం గుడిలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, మొక్కులు నిర్వహి స్తుంటారు.



**కావలిలో** మరొక ప్రత్యేక అంశం ఆంగ్లేయుల కాలంనాటి బొంతరాళ్ల కట్టడాలు. నేటికీ అవి చెక్కుచెదరక నిలిచి వున్నాయి. ఇవన్నీ బ్రిటీష్ హయాంలో నిర్మించినవి. ఆర్డీవో, ఎమ్మార్వో, రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా పరిషత్ హైస్కూలు, ఆర్.అండ్.బి బంగళా, కోర్టు, సబ్‌ట్రెజరీ, రూరల్ పోలీసుస్టేషన్, సబ్‌జైలు మొదలైనవి.

కావలి, ముసునూరు, గౌరవరం, మద్దూరుపాడు ప్రాంతాలలో ఆనాడు బొంతరాయి గనులుండేవి. వాటి మీద ఆధారపడి బతికే కార్మికు లుండేవారు. వారి నైపుణ్యం ఈనాటికీ మనకు ఆశ్చర్యం కల్గిస్తుంది.

## కావలి కమిషనర్ బదిలీ

కావలి మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ గుంటూరుజిల్లా నరసారావుపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అధికారపార్టీ నేతల ఒత్తిడి నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగినట్లుగా తెలుస్తోంది.


మూడున్నర దశాబ్దాల
పత్రికా రంగ పయనంలో
అలుపెరుగని పోరు సల్పుతూ
మొక్కవోని ధైర్యంతో,
మడమ తిప్పని నైజంతో
ముందుకు సాగుతూ...
నెల్లూరీయుల హృదయాల్లో
శాశ్వత స్థానం పొందుతూ
కావలిలో కార్యాలయాన్ని
ఏర్పాటు చేసుకుంటున్న
లాయర్
వారపత్రిక
సారధికి, సిబ్బందికి
హార్థిక శుభాభినందనలు.



రావి మోహన్‌చౌదరి
కర్నాటక తెలుగుదేశంపార్టీ కో-ఆర్డినేటర్
సెల్: 8971565157

శుభాభినందనలు

నెల్లూరు వాణికి ప్రతీకగా, తెలుగు బాణికి వేదికగా
నిజాయితీకి నిలువుటద్దంగా
స్వచ్ఛమైన వార్తకు ప్రతిరూపంగా భాసిల్లుతూ...
మూడున్నర దశాబ్దాల చరిత్రలో
పత్రికా రంగానికే మణిమకుటంలా విరాజిల్లుతున్న
లాయర్
తెలుగు వారపత్రిక
నేడు మా ఊరు కావలిలో ప్రాంతీయ కార్యాలయాన్ని
ఏర్పాటు చేసుకున్న శుభసందర్భంగా
శుభాభినందనలు.





రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
శాసనసభ్యులు, కావలి.

# ఫ్లెక్సీ పోకడలకు కళ్లెం వేయాలి

- అర్హకులకు, అనామకులకు సైతం ఫ్లెక్సీ కటౌట్‌లు
- దేవుళ్ల ఫోటోల పక్కన రాజకీయనాయకుల చిత్రాలు
- దిగజారిపోతున్న విలువలు
- పెరుగుతున్న విషసంస్కృతి

కొన్నేళ్ల క్రితం జాతీయ, రాష్ట్రస్థాయి, స్థానిక ప్రజానాయకుల ఫోటోలతో కటౌట్‌లు, వాల్ పోస్టర్‌లు మాత్రమే కనిపించేవి. ఎన్నికల సమయాలలో పేరు మోసిన ప్రజాప్రతినిధుల కటౌట్‌లు, గోడ పత్రాలు వెలిసేవి. ఇక సినిమా హీరోల అభిమానం చెప్పనవసరం లేదు. అది ప్రత్యేక ప్రపంచం. సమాజంలోకి ఫ్లెక్సీలు రానంతవరకు ఒక స్థాయి నాయకులు, గొప్ప వ్యక్తులు మాత్రమే కటౌట్‌ల రూపంలో, వాల్‌పోస్టర్‌ల మీద కనిపిస్తుండే వాళ్లు. మరీ ఫ్లెక్సీలు వచ్చాక ప్రజాప్రతినిధులకే కాక, తలమాసినోళ్లకు కూడా ఆయా పండుగలు, పుట్టినరోజులలో శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, ప్రజాఉద్యమాలు చేసినవాళ్లకే కాదు ఆకురౌడీలు, వారి వీధుల్లో జులాయిగా తిరిగే బోకురౌడీలకు కూడా ఫ్లెక్సీలు కడుతూ గుర్రాలను, గాడిదలను ఒకే గాటిన కట్టేస్తున్నారు. ఇంకొందరు నాయకులయితే తమ పుట్టిన రోజుకు, నూతన సంవత్సర వేడుకలకు తమ ఫోటోలతో అభిమానులు తమకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లుగా తమ ఖర్చుతో ఫ్లెక్సీలు వేయించుకుంటుండడం మరీ విడ్డూరం.


కోటంరెడ్డి ఆదేశంతో ఫ్లెక్సీలను తొలగిస్తున్న అనుచరులు

ఇంకా బాధాకరమైన విషయమేంటంటే వివిధ దేవస్థానాల బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు, బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ సమయంలో, క్రిస్మస్ పర్వదినం రోజున దేవుళ్ల, పవిత్ర ప్రార్థనా మందిరాల ఫోటోల పక్కన ప్రజాప్రతినిధుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కొందరు అనుచరులు శుభాకాంక్షలు తెలుపుతుంటారు. దేవుళ్ళ, పవిత్ర మందిరాల పక్కన నామమాత్రులైన మానవమాత్రుల ఫోటోలు పెట్టడమేమిటి? ఈ సంస్కృతి మంచిది కాదు. ఓ పక్క రంగనాయకుల స్వామి ఫోటో వుంటుంది, ఇంకోపక్క రాజకీయ నాయకుల ఫోటో వుంటుంది. ఓ పక్క ఏసుప్రభువు ఫోటో... ఇంకోపక్క ఎమ్మెల్యే, ఎంపీల ఫోటోలు. రాజకీయనాయకులు దేవుళ్ల స్థాయికి ఎదిగారా? దేవుళ్లను ఇక్కడ రాజకీయ నాయకులతో పోలుస్తున్నారా? ఈ విష సంస్కృతికి ఎక్కడో ఒకచోట చెక్‌పెట్టాలి.

ఈమధ్య నెల్లూరురూరల్‌లోని నరసింహపురంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి ఫోటోలు పెట్టి అనుచరులు దేవస్థానం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దగ్గరుండి మరీ ఈ ఫ్లెక్సీలను తీసివేయించడమేకాక, భవిష్యత్‌లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేయొద్దని తన అనుచరులకు సూచించారు. దేవస్థానాలు, చర్చిలు, దర్గాల వద్ద రాజకీయనాయకుల ఫోటోలతో ఫ్లెక్సీలు కట్టే విషసంస్కృతికి చెక్‌పెట్టే దిశగా కోటంరెడ్డి తీసుకున్న చొరవ అభినందించదగినదే! అదే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకుండా నేతలు తమ అనుచరులకు సూచనలివ్వాలి. ఆధ్యాత్మిక కేంద్రాలను ఫ్లెక్సీలతో కలుషితం చేయకుండా, వాటిని మానసిక ప్రశాంతత చేకూర్చే పవిత్ర క్షేత్రాలుగానే ఉండనివ్వండి.

## డిఎస్సీకి ఏర్పాట్లు

టెట్ కమ్ టిఆర్‌టి ఉపాధ్యాయ అర్హత పరీక్షకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9, 10, 11తేదీల్లో జరగనున్న పరీక్షలకు 33కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,374మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 350, మునిసిపాలిటీల్లో 75పోస్టులు మొత్తం 425పోస్టులు భర్తీ చేయనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 33మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 33మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 15మంది రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 213మంది హాల్‌సూపరింటెండెంట్లు, 415మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

- అపోలోలో...

## కీళ్ళ మార్పిడికి అత్యాధునిక చికిత్స



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో కీళ్ళ మార్పిడి కోసం అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 2వ తేదీ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేవిగేషన్ పద్ధతి ద్వారా మోకాళ్ళ కీళ్ల మార్పిడి చికిత్సావిధానం దేశంలో కొన్ని ఆసుపత్రుల్లో మాత్రమే ఉందని, దీన్ని నెల్లూరు అపోలో ఆసుపత్రిలో కూడా ప్రవేశపెట్టామన్నారు. నెల్లూరుకు చెందిన ఓ మహిళ(63)కు రెండు మోకాలు చిప్పలు అరిగిపోతే నేవిగేషన్ పద్ధతి ద్వారా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. అహ్మదాబాద్‌లో పలు దేశాల నుంచి వచ్చిన 70మంది డాక్టర్లకు లైవ్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్ గురించి వివరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అపోలో యూనిట్ హెడ్ డాక్టర్ విష్ణువర్ధన్, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.


ఆనంద శుభాకాంక్షలు

నెల్లూరీయుల గుండె దీపిక
అందరి మనసెరిగిన మానస పుత్రిక
లాయర్ వారపత్రిక
కావలి పట్టణంలో తమ శాఖను ప్రారంభించుకుంటున్న శుభవేళ
ఆనందశుభాకాంక్షలు.



బీద మస్తాన్‌రావు
మాజీశాసనసభ్యులు మరియు
రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు

బీద రవిచంద్ర
అధ్యక్షులు,
నెల్లూరుజిల్లా తెలుగుదేశంపార్టీ



# కళ్యాణ వైభవం...!




సూర్య సూపర్ మార్కెట్ అధినేత పట్నం వివేకానందరెడ్డి - వసంతలక్ష్మిల కుమార్తె **కృష్ణప్రియాంక - భార్గవ్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు ఎద్దుల జనార్ధన్‌రెడ్డి - భారతిల కుమారుడు)ల కల్యాణం ఏప్రిల్ 30వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి మేనల్లుడు ఏనుగ మురళీధర్‌రెడ్డి - శాలినిల కుమార్తె **తపశ్వి - ప్రశాంత్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు నల్లపరెడ్డి వెంకటనరసారెడ్డి - లక్ష్మిల కుమారుడు)ల పెళ్ళి మే 3వ తేదీ నెల్లూరులోని ఏఎన్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



గూడూరు నెల్‌క్యాస్ట్ పిఆర్‌ఓ ఆనిమెళ్ళ శివకుమార్ మేనమామ, గుంటూరుజిల్లా పొదిలివారిపాళెం వాస్తవ్యులు పొదిల శ్రీరామమూర్తి - వరలక్ష్మిల కనిష్ఠ కుమారుడు **దుర్గా పూర్ణచంద్రరావు - దివ్యనాగ పావని**ల వివాహం ఈ నెల 3వ తేదీ కృష్ణాజిల్లా పెడన వాసవి ప్రార్థనా మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



టి.వి. ఆర్టిస్ట్, మురళీఆర్ట్స్ అధినే శింగంశెట్టి మురళీమోహన్‌రావు - అంజనిల కుమారుడు **అభిషేక్ - కీర్తి** (చిట్వేలు మండలం నాగవరం గ్రామ వాస్తవ్యులు అరిగెల వెంకటసుబ్బయ్య - సుజాతల కుమార్తె)ల పరిణయం మే 3వ తేదీ నెల్లూరులోని సోమిరెడ్డి వారి కల్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**- డిఎస్పీ శ్రీనివాస్**




బారికేడ్లను ప్రారంభిస్తున్న డిఎస్పీ బి.శ్రీనివాస్

## గూడూరు డివిజన్ వార్తలు

గూడూరు డివిజన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్పీ బి.శ్రీనివాస్ తెలిపారు. గూడూరు గడియారపు స్థంభం వద్ద చెన్నైకు చెందిన జేఎన్ఎన్ ఇంజనీరింగ్ కళాశాల అందజేసిన 30రోడ్డు ట్రాఫిక్ బారికేడ్లను 2వ తేదీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ దాతల సహకారంతో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించగలమన్నారు. పట్టణంలో ఇప్పటికే సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, త్వరలో వీటిని ప్రారంభిస్తామన్నారు. మీనాక్షి పరిశ్రమను ట్రాఫిక్‌కు సంబంధించిన 300ప్లాస్టిక్ బారికేడ్లను అడిగామని, వారు స్పందించి ఇస్తామని చెప్పారన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ సిఐలు టి.వి.సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, ఎస్సైలు బాబి, హనీఫ్, కళాశాల ప్రతినిధులు రవీంద్రరెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో

# ముస్లిం చిన్నారులకు ఖత్నాలు



చిన్నారులకు మందులు అందజేస్తున్న ముస్లింనెట్‌వర్క్ సభ్యులు

మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో గూడూరులోని షాదిమంజిల్‌లో ఆదివారం ఉచితంగా ముస్లిం చిన్నారులకు ఖత్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధ్యక్షుడు షేక్‌రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ముస్లిం సంక్షేమమే ధ్యేయంగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సంస్థ నిర్వహించే కార్యక్రమాలతో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. 120మంది చిన్నారులకు ఖత్నాలు చేశారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రహీమ్, నాజర్, షేక్ కరిముల్లా, ఉమేదిసాబ్, యూత్‌కన్వీనర్ అనీస్, బషీర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### మురళీకృష్ణ యోగా ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో

# వేసవి ఉచిత యోగా శిక్షణా తరగతులు

గూడూరు మాలవ్యా నగర్‌లో వేసవి ఉచిత యోగా, వ్యాయామ, ప్రాణాయామ, ధ్యాన శిక్షణా తరగతులు మే 1 నుండి మే 21వరకు 21రోజులు జరుగుతాయని వ్యవస్థాపకుడు కట్టా మురళీకృష్ణ 'లాయర్'కు తెలిపారు. విద్యార్థులు చేరి యోగాభ్యాసము చేసుకొనవలసిందిగా ఆయన కోరారు.



విద్యార్థులకు యోగా నేర్పుతున్న మురళీకృష్ణ



ఈ నెల 3వ తేదీ తిరుపతిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తిని కలసి సత్కరిస్తున్న గూడూరు ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మెన్ మరియు ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు

# పట్రా మరణం తీరనిలోటు

**--- పనబాక కృష్ణయ్య**

గూడూరు మాజీఎమ్మెల్యే పట్రా ప్రకాశరావు మృతి గూడూరు నియోజకవర్గ ప్రజలకు, పార్టీకి తీరని లోటని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య సోమవారం తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో ప్రకాశరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్రా వివాదరహితుడని, సౌమ్యుడని, గూడూరు అభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

అదేవిధంగా మాజీ కేంద్రమంత్రి పనబాకలక్ష్మి, మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత, నాయకులు దేవకుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి, దగ్గోలు సురేంద్ర తదితరులు సంతాపం ప్రకటించారు.

# అవినీతిపై విచారణ జరిపించండి

--- మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకా డిమాండ్ ---



నెల్లూరు నగరపాలక సంస్థలో అవినీతి పెచ్చుమీరిపోయిందని, ఆ అవినీతి వ్యవహారాలపై వెంటనే విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకిని కలిసి ఆమేరకు వినతి పత్రం సమర్పించారు. చక్రధర్‌బాబు కమిషనర్‌గా వున్నప్పుడు బిల్లులన్నిటినీ పరిశీలించి, దాదాపు రూ. 6 కోట్ల దాకా అక్రమబిల్లులు వున్నట్లు గుర్తించి, వాటిని పాస్ చేయకుండా పక్కనపెట్టారని, ఇప్పుడాయన బదిలీ అయిన తర్వాత వాటికి రెక్కలు వచ్చాయని వివేకా విమర్శించారు. వివేకా వెంట ఆనం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఎర్రదీపం' పుస్తకావిష్కరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి మోపూరు పెంచలనరసింహం రచించిన 'ఎర్రదీపం' ఆంధ్రాంగ్ల కవితా సంపుటిని ఇటీవల బుచ్చిరెడ్డిపాళెంలో ఆవిష్కరించారు. బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన ప్రముఖ వైద్యులు పి.రాఘవరెడ్డి ఈ కవితాసంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఆదిత్య, నెరసం అధ్యక్షులు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి మాటేటి రత్న ప్రసాద్, జి.సుభద్రాదేవి, జి. నరేంద్రబాబు, అవ్వారు శ్రీధరబాబు, ఇంద్రగంటి మధుసూదనరావు, ప్రసూనాశరత్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు. ఈ కవితాసంపుటిని జ్యోత్స్నా ఫణిజ ఆంగ్లానువాదం చేశారు.

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు అనేక ప్రాంతాల్లోని రైతులను బాగా దెబ్బతీశాయి. అసలే, కష్టాలు నష్టాల్లో వున్న రైతుల బాధలు చాలవన్నట్లు మళ్ళీ ఈ అకాల వర్షాలొకటి. తడవతడవకీ వస్తున్న ఈ కష్టాలతో రైతుల బాధలు వర్ణనాతీతం. అప్పోసప్పో చేసి పంటలు వేసుకుంటే, పంటలు పండి చేతికి అందే సమయానికి ఏదో ఒక చీడపీడ వుంటూనే వుంది. దీంతో, తెచ్చుకున్న అప్పులు ఎలా కట్టాలి దేవుడా!.. అంటూ అన్నదాతలు లబోదిబోమంటున్నారు.



## అకాల వర్షం..

# అన్నదాతలకు అపార నష్టం!

ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి సమయంలో జిల్లాలోని అనేక మండలాల్లో కురిసిన అకాల వర్షాలు మళ్ళీ రైతులను పీకల్లోతు అప్పుల్లో ముంచుతున్నాయి. పలు ప్రాంతాల్లో పంటపొలాలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో జోరుగా కురిసిన వర్షం ధాటికి అనేక ప్రాంతాల్లోని పండ్ల చెట్లు, పంటపొలాలకు తీరని నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాలు నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా ఆ ఒక్కరోజునే సగటున 11.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చేజర్ల మండలంలో అత్యధికంగా 57.2 మి.మీ, ఆత్మకూరులో 56.2, దుత్తలూరులో 52.6 మర్రిపాడులో 39.3 మి.మీ వర్షం కురవడంతో పంటపొలాలు బాగా దెబ్బతిన్నాయి. ఇంకా పలు మండలాల్లో జోరైన వానే కురిసింది. దీంతో ఆయా మండలాల్లో ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ తోటలకు భారీ నష్టం జరిగింది. ఈదరుగాలుల ధాటికి ఆత్మకూరు మండలంలో మామిడి తోటల్లోని కాయలు, పిందెలన్నీ నేలరాలిపోయాయి. దీంతో రైతన్నలు దిగాలు పడిపోయారు. సంగం, మర్రిపాడు తదితర మండలాల్లోని అనేక చోట్ల వున్న బొప్పాయి తోటలు ఈ పెనుగాలుల దెబ్బకు ఎక్కడివక్కడ విరిగి పడిపోయాయి. దీంతో రైతుల బాధ వర్ణనాతీతం. కళ్ళముందే వేసుకున్న పండ్లతోటలు నేలకూలిపోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అదునులో పదునైన వర్షం కురిసి పంటచేలు బాగా పండాలి వాన దేవుడా.. అని మొక్కుకుంటున్న రైతులను వరుణుడు కరుణించకపోగా, ఇలా అకాల వర్షాలు వచ్చి, వేసుకున్న పంటలను కాస్తా నీటముంచుతుండడం ఎంతో దురదృష్టం. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ దుస్థితిలో రైతులను ఆదుకోకుంటే అన్నదాతలకు కష్టమే!..గత నెలలో కూడా 12వ తేదీ నుంచి అయిదురోజుల పాటు



జిల్లాలో అక్కడక్కడా కురిసిన అకాల వర్షాలు రైతులను కష్టాల కడగండ్లలో ముంచాయి. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి, నష్టాల వివరాలు సేకరించి ప్రభుత్వం ద్వారా రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సివుంది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



విజయాభినందనలు

తెలుగు భాషకు, నెల్లూరు యాసకు పెద్దపీట వేస్తూ...
ఈ పోటీ ప్రపంచంలో ధైర్యంగా ముందుకెకుతూ
నేడు కావలి పట్టణంలో తమ శాఖను ప్రారంభించుకుంటున్న
లాయర్
తెలుగు వారపత్రికకు
విజయాభినందనలు.



మాగుంట శ్రీనివాసులురెడ్డి
మాజీ పార్లమెంటు సభ్యులు, ఒంగోలు



మాగుంట పార్వతమ్మ
మాజీ పార్లమెంటు సభ్యురాలు, ఒంగోలు

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. వృత్తివ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వ్యాపారాలలోను, ఉద్యోగాలలోనూ ఆటంకాలను అధిగమిస్తారు. బ్యాంకు వ్యవహారాలు, చెల్లింపులలో జాగ్రత్త అవసరం. అగ్రిమెంట్లు, క్రయవిక్రయాలకు అనుకూలత బాగుండును. విలువైన వస్తు వస్త్రాభరణాలు సమకూర్చుకొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికంగా మంచి అవకాశాలు రావడం, రాబడి పెరగడం ఉంటుంది. బిడ్డల వల్ల స్వల్పంగా ఇబ్బందులు పడతారు. అనుకున్న సొంత పనులు సవ్యంగానే జరుగుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు పోటీ పరీక్షలకై గట్టి కృషి చేస్తారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకావశాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వారం మధ్యలో పనులకు ఆటంకాలుంటాయి. వ్యాపార వర్గాలకు అవకాశాలు ఆర్ధికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది. సంప్రదింపులు, అగ్రిమెంట్లకు అనుకూల సమయం. వృత్తి పరంగా పెరుగుదల బాగుంటుంది. విలాస వస్తువులు, విలువైన వస్తువులు కొంటారు. అవసరాలకు స్వల్పంగా ఋణం చేస్తారు. ఉద్యోగార్ధులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ప్రయత్నపూర్వకంగా అవకాశాలు కలసివస్తాయి. అదనపు ఖర్చులు ఈ వారం పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించి ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. వ్యాపారాలలో ఇతరులతో కొద్దిపాటి చికాకులుంటాయి. ఆహ్వానాలు, కీలకపత్రాలు, పన్ను నోటీసులు అందుకుంటారు. ప్రభుత్వ ఋణాలు లభించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ వ్యయాలు అంచనాలకు మించుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా జరుపుకొంటారు. బిడ్డల వల్ల చిన్న ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. కొత్త పరిచయస్తులతో జాగ్రత్తగా మెలగండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

మీ నిర్ణయాలు, పనులు మంచి ఫలితాలనిస్తాయి. ఉద్యోగులకు పనిభారం ఎక్కువ మరియు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. ముఖ్యపనులు హడావిడిగా చేస్తారు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఋణాల వల్ల వత్తిడి పెరుగుతుంది.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 08.05.2015 నుండి**
**తేది. 14.05.2015 వరకు**

ఈ వారం మేషంలో రవి, వృషభంలో కుజ బుధులు, మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, ధనుర్మకర కుంభాలలో చంద్రుడు, మీనంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 13 బుధవారము హనుమజ్జయంతి

### ముహూర్తములు

తేది 8 శుక్రవారం ఉదయము గంట 7.45 నుండి గంట 9.50లోగా మిధున లగ్నము నందు వివాహ, వ్యాపార, గృహారంభములు.

తేది 10 ఆదివారము ఉదయము గంట 9.45 నుండి గంట 11.54లోగా కర్కాటక లగ్నమున వివాహ వ్యాపారములు.

### వైశాఖ బహుళపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 08 | శుక్ర | చతుర్ధి | ఉ॥ గం.8.08వ॥ |
| తేది. 09 | శని | పంచమి | ఉ॥ గం.6.51వ॥ |
| | పిదప | షష్ఠి | రా॥ గం.5.42వ॥ |
| తేది. 10 | ఆది | సప్తమి | రా॥గం.3.24వ॥ |
| తేది. 11 | సోమ | అష్టమి | రా॥గం.1.10వ॥ |
| తేది. 12 | మంగళ | నవమి | రా॥గం.10.49వ॥ |
| తేది. 13 | బుధ | దశమి | రా॥గం.8.17వ॥ |
| తేది. 14 | గురు | ఏకాదశి | రా॥గం.6.00వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారవర్గాల వారు ఆర్ధిక సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుంది. ఆదాయం సామాన్యం. వృత్తి జీవనం కలవారు రాణిస్తారు. ప్రభుత్వ అనుమతులు లభించడం, ఋణాలు బ్యాంకుల నుండి లభించడం జరుగుతుంది. స్థిరాస్తుల సమస్యలు ఎట్టకేలకు రాజీకి రాగలవు. ఉద్యోగులకు పనిభారం జాస్తి. ఆలోచనలు పెరుగుతాయి. ప్రశాంతత కల్పించుకొనడం మంచిది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేసే పనులు, సొంత వ్యవహారాలలో ఇబ్బందులు కలుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, పనులు ఆలస్యం కాగలవు. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. నిర్మాణాలందు, పరిశ్రమలందు యజమానులకు వర్కర్ల వల్ల సమస్యలు కలుగవచ్చును. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అవసరాలకు డబ్బు అందుతుంది. ఆస్థి, భూవివాదాలు పరిష్కారానికి రాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కార్యసామర్ధ్యం బాగుంటుంది. అందరిని మెప్పించి అనుకూలంగా మలుచుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. సంప్రదింపులలో ప్రముఖపాత్ర వహిస్తారు. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. ఉద్యోగులు అధికారులతో సత్సంబంధాలు నెలకొల్పుకొంటారు. ఇతరులకు సహాయ పడటం చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. అవకాశాలు ఆర్ధికంగా బాగుంటాయి. మీ మాటకు గుర్తింపు బాగుంటుంది. ఋణ ప్రయత్నాలు ఫలించడం, రావలసిన బాకీలందు అనుకూలత బాగుంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు ఎదురైనా సమర్ధవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబ వ్యక్తుల వల్ల చిన్న సమస్యలుండినా సర్దుబాటు చేస్తారు. వ్యాపార, వృత్తి జీవనం కలవారికి ఆర్ధికావకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఉద్యోగులకు పబ్లిక్‌తోను అధికారులతోను సత్సంబంధాలు బలపడతాయి. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. కుటుంబసౌఖ్యం, విద్యాప్రగతి బాగుంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలను నిర్ణయం చేస్తారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

మీ నిర్ణయాలు మంచి ఫలితాన్నిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి మంచి అవకాశాలు దొరుకుతాయి. వృత్తివ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయము పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు లభించడం ఉంటుంది. కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అనుకూల సమయం. ఆరోగ్యం బాగుంటుంది.


**CHANGE OF NAME**

My daughter **Chatala Krishna Sree,** Age: 12 Years, DOB: 02.06.01, Student of Class IX, Shall henceforth be known as **CHATALA VATSALAYA.**


Nellore, 08.05.2015 — **CHATALA PRASAD**, Father


## కస్తూరిదేవి గార్డెన్స్‌కి మోక్షం

***కస్తూరిదేవి విద్యాలయ సంస్థల ప్రాంగణానికి ఏం వాస్తు దోషముందోగాని అక్కడ ఎవరు ఏ పని తలపెట్టినా నిత్యం అవాంతరాలు ఎదురవుతూనే వుంటాయి. అలాంటిదే ఈ సంఘటన!***

ఇటీవల కోట్ల రూపాయలు వెచ్చించి విద్యాలయ ప్రాంగణంలో నిర్మించిన కస్తూరిదేవి గార్డెన్స్ ఎయిర్ కండీషన్డ్ హాలు సోదరుల మధ్య వివాదంతో కోర్టుకెక్కి మూత పడింది. జనవరి నుండి ఇప్పటివరకు జరిగిన ఎన్నో పెళ్ళిళ్లు ఇక్కడ నుండి వేరే వేదికకు మారిపోయాయి. తీరా పెళ్ళిళ్ళ సీజన్ అయిపోయి, మరో పది రోజుల్లో అన్‌సీజన్ రానున్న తరుణంలో మే7వ తేదీ గురువారం కోర్టు ఈ వివాదానికి తెరదించి కస్తూరి దేవి గార్డెన్స్‌కి మోక్షం కల్పించింది. ఎట్టకేలకు మూతపడ్డ హాలు మళ్ళీ తెరుచుకుంది.

అయిదు సంవత్సరాల సుధీర్ఘ లీజుకు ఖాళీ స్థలాన్ని తీసుకుని ఇక్కడ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఏసి ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దింది శాంతి హైరర్స్ యాజమాన్యం. అయితే ఒక చిన్న వివాదం కారణంగా ఈ ప్రాంగణానికి కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు మున్సిపల్ శాఖ సీలు వేసింది. ఇప్పుడు కోర్టు తీర్పు యాజమాన్యానికి అనుకూలంగా రావడంతో ఆ సీలు తొలగించింది. మరి ఈ హాలుకు అనుమతులున్నాయా? లేవా? అన్న విషయాన్ని ప్రస్తుతానికి మున్సిపాల్టీ కూడా గాలికొదిలేసినట్లుంది!



## బిల్డ(ప్)ర్ నారాయణ

(మొదటిపేజీ తరువాయి)

తిరిగినా రాత్రికి తుళ్లూరుకు చేరుకుంటాడు. ఒకవేళ రాత్రిళ్లు ఎక్కడ పర్యటించినా తెల్లారేసరికి అక్కడకు పోవాల్సిందే. ఇక్కడ రాజధాని భూసేకరణకు నారాయణ పడుతున్న ఆపసోపాలు చూస్తుంటే ఆయన మున్సిపల్ మంత్రిగా కాదు, తూళ్లూరు విఆర్‌ఓగా అనిపిస్తున్నాడు. ఈ పరిసర గ్రామాల్లో ఇంటింటికి ఆయనే పోయాడు. రైతుల నుండి పాస్‌బుక్‌లు, అడంగళ్లు వంటివి ఆయనే కలెక్ట్ చేసాడు.

రాజధాని భూముల విషయంలో ఆయన తెగ ఆత్రం చూపిస్తున్నాడు. ఇది ఎందుకనేది ఎవరికీ అర్థం కాలేదు. రైతులు ఇస్తే భూములు తీసుకోవచ్చు. కాని భూములు ఇవ్వని రైతుల నుండి కూడా బలవంతంగా లాక్కుంటామని నారాయణ గతంలోనే ప్రకటనలిచ్చి ఉన్నాడు. ఈమధ్య కొందరు రైతులు హైకోర్టుకు పోయారు. రాజధానికి తమ భూములు పోకుండా హైకోర్టు నుండి ఆర్డర్‌లు తెచ్చుకున్నారు. ఇలాంటి రైతులపై నారాయణ తీవ్ర ఆగ్రహావేశాలు చూపిస్తున్నాడు. రైతులు భూసమీకరణకు ఒప్పుకోకపోతే భూసేకరణ చట్టాన్ని ప్రయోగించి భూములు లాక్కుంటామని బెదిరిస్తున్నారు. ఇది ఎంతవరకు న్యాయం. నెల్లూరు జిల్లాలో నారాయణకు వందలాది ఎకరాల భూములున్నాయి. ఇక్కడ పరిశ్రమలు పెట్టి ఆయన భూములు లాక్కుంటే అప్పుడు తెలిసొస్తుంది తుళ్లూరు రైతులు పడే బాధేంటో! రాజధానిలో బహుళ అంతస్థుల భవనాలు నిర్మాణానికి 3వేల ఎకరాలు సరిపోతాయని ఓ పక్క ప్రభుత్వమే చెబుతోంది. ఇంకోపక్క 33వేల ఎకరాలు సేకరించడమెందుకు? గత ఎన్నికల్లో నారాయణ తెలుగుదేశంకే కాదు, వైకాపాకు కూడా ఖర్చుపెట్టి ఉన్నాడు. పెట్టిన డబ్బులు రాబట్టుకోవడానికి రాజధాని రియల్ వ్యాపారానికి తెరతీసినట్లుగా వుంది.

## అస్తమించిన ప్రకాశం

(మొదటిపేజీ తరువాయి)

ఆ పరిచయమే ప్రకాశంను రాజకీయాలవైపు నడిపింది. నేదురుమల్లి ప్రోద్భలంతో 1978లో గూడూరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 1989, 2004లలో కూడా ఆయన గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణసంస్థ ఛైర్మెన్‌గా, నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్‌గా, ఎస్.వి.యూనివర్శిటీ సెనెట్ మెంబర్‌గా పలు పదవులు నిర్వహించారు. తన జీవిత కాలంలో ఆయన కాంగ్రెస్‌పార్టీని మార్చలేదు. తనకు రాజకీయ జన్మనిచ్చిన నేదురుమల్లిని వీడలేదు. అంత విశ్వాసం చూపించాడు. ఎమ్మెల్యేగా వున్నప్పుడు కూడా చాలా సాధారణ జీవితం గడిపాడు. ఎమ్మెల్యేగా కూడా రిక్షాలలోనే తిరిగేవాడు. 15ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసినా ఆస్థిపాస్తులు సంపాదించలేదు. మనిషి ఎంత నిజాయితీగా బ్రతికాడనేదానికి ఇదే నిదర్శనం. ఆయన ఆస్తి సంపాదించకపోయినా జీవితంలో సంపాదించిన మంచిపేరే ఆయనకు మిగిలిన ఆస్థి. ప్రకాశంకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రకాశం మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

గల్పిక

# అప్పు తీర్చడానికి దోమల అమ్మకం

అది హైదరాబాద్. కేసీఆర్ సీఎంగా వున్న ఆ నగరంలో ఆంధ్రా సీఎం చంద్రబాబు నివాసం. చంద్రబాబు టిఫిన్ కానిచ్చి హాల్‌లోకి వచ్చాడు. అక్కడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వి.కృష్ణారావు చాలా సేపటి నుండి వున్నాడు. చంద్రబాబు రావడం తోటే... సీఎస్ గారు... మన రాష్ట్రంలో పెట్టుబడుల కోసం లోకేష్‌బాబు అమెరికా వెళుతున్నారు. ఆయన వెంట వెళ్ళడానికి అధికారులెవరైనా సిద్ధంగా ఉన్నారా అని అడిగాడు. కృష్ణారావు అందుకు... లేకేం సార్, కుప్పలు తెప్పలుగా ఉన్నారు. లోకేష్ వెంట అమెరికా పర్యటనకు వెళతారా అని నేనడి గానో లేదో నూటపాతికమంది దాకా అధికారులు లోకేష్ వెంట వెళ్లడానికి రెడీ అయ్యారు. ప్రయాణ ఖర్చులు కూడా ప్రభుత్వమివ్వనక్కరలేదు, తామే పెట్టుకుంటామంటున్నారని చెప్పాడు. అధికారులు లోకేష్ వెంట వెళ్ళడానికి ఇంత ఆసక్తి చూపడం వెనుక కారణమేమై ఉంటుందని చంద్రబాబు అడి గాడు. దానికి కృష్ణారావు... ఈమధ్య అమెరికాలో లోకేష్‌బాబు తన ఫ్రెండ్స్‌తో కలిసి తీసుకున్న ఫోటోలు వాట్సప్‌లలో, ఫేస్‌బుక్‌లలో హల్‌చల్ చేసాయి కదా, అందరూ ఆ ఫోటోలను చూసారు. లోకేష్‌బాబుతో అమెరికా పోతే టూర్ ఎంజాయ్ చేయొచ్చనే వీళ్లందరూ ఆసక్తి చూపిస్తుండొచ్చని కృష్ణారావు అన్నాడు. అంతలో అక్కడకు నైట్‌రైడర్ పి.నారా యణ, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఇంతియాజ్, కార్పొరేటర్లు, స్టాండ్‌బై మేయర్ ఆనం వెంకటరమణారెడ్డి వచ్చారు. ఏం ఇలా వచ్చారని చంద్రబాబు అడిగాడు. ఏం లేదు సార్, నెల్లూరుకు 1090కోట్లు హడ్కో ఋణం మంజూరైంది కదా, ఇందుకుగాను మీకు థాంక్స్ చెప్పిపోదామని వచ్చారని నారాయణ అన్నాడు. ఈ డబ్బుతో ఏమేం చేయాలని అనుకుంటున్నారని చంద్రబాబు అడిగాడు. అందుకు అజీజ్... ముం దుగా మీకు, మీ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు గారికి సన్మానం చేద్దామనుకుంటున్నాం. ఆ తర్వాత ఈ డబ్బులొచ్చినందుకు భారీగా బాణాసంచా కాల్చి నెల్లూరంతా పండుగ చేద్దామనుకుంటున్నాం. నగర శివార్లలో మంచి ఆర్చీలు, అందమైన పార్కులు కట్టిస్తాం. ఈ ఖర్చులంతా పోను ఇంకా ఏమన్నా నిధులు మిగిలితే భూగర్భ డ్రైనేజీకి, మంచినీళ్లకు ఖర్చు పెట్టాలనుకుంటున్నాం సార్ అని చెప్పాడు. మీరు హడ్కో నిధులంటే ఫ్రీగా ఇచ్చినవనుకుంటు న్నట్లున్నారు, అవి ఫ్రీగా ఇచ్చేవి కావు, వడ్డీతో కలిపి తిరిగి కట్టాలి. హడ్కోకు మళ్లీ అప్పు ఎలా కట్టాలో ఆలోచించుకోండి, చివర్లో నా మీద పడితే రూపాయి కూడా ఇవ్వను. మొదలే నా పరిస్థితి సాయిబాబా గుడి మెట్ల మీద భిక్షగాడిలా వుందని చంద్రబాబు అన్నాడు. హడ్కో అప్పు ఎలా కడతారనే సరికి అజీజ్‌కు గుండెల్లో గుండ్రాయి పడినంత పనైంది. దిగులుగా ముఖంపెట్టి అక్కడ నుండి వచ్చేసాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి గాంచిన నెల్లూరు నగరం. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఛాంబర్. మేయర్ అజీజ్‌తో పాటు ఇన్‌ఛార్జ్ కమి షనర్ ఇంతియాజ్, కలెక్టర్ జానకి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా నందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టి.రమేష్ రెడ్డి, మాజీమేయర్‌లు భానుశ్రీ, పులిమి శైలజ, మాజీఛైర్‌పర్సన్ అనూరాధ, అన్ని పార్టీల కార్పొరేటర్లు ఉన్నారు. అజీజ్ మాట్లాడుతూ... మనకు హడ్కో నుండి 1090కోట్లు వస్తున్నాయి. వాటిని అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తాం, కానీ సంవత్సరానికి వంద కోట్లు తిరిగి మనం కట్టాలి. మన కార్పొరేషన్ ఆదాయం చూస్తే 40కోట్లు కూడా లేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ పన్నులు పెంచక తప్పదేమోననిపిస్తుంది అని అన్నాడు. వెంటనే కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి లేచి... ఈసారి జనం మనల్ని చేతుల్తో కూడా కొట్టరు... వాళ్లకు తిక్కరేగే పనులు చెప్పొద్దన్నాడు. వెంటనే వివేకా వుండి... మనకు వాళ్లు ఒక్క రూపాయి వడ్డీకి ఇస్తున్నారు కదా, మనం ఆ 1090కోట్లను మూడు రూపాయల వడ్డీకి మారుద్దాం, నాకు తెలిసిన వడ్డీ వ్యాపారులు చాలామంది వున్నారు. వారి సాయం తీసుకుంటాం, వడ్డీ ద్వారా వచ్చిన ఆదాయంతో అభివృద్ధి పనులు చేసుకుందాం, అసలు మాత్రం హడ్కోకు కట్టేద్దామన్నాడు. దానికి అనిల్... వాళ్లకో వీళ్లకో ఇవ్వడం ఎందుకు మంత్రి నారాయణకే వడ్డీకి ఇద్దాం, ఆయనకు కూడా బయట తెచ్చుకునే శ్రమ తప్పుతుందని ప్రతిపాదించాడు. ఈ వడ్డీ ప్రతి పాదనలకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒప్పుకోలేదు. వడ్డీ మాట దేముడెరుగు, వీళ్లు అసలు ఎగ్గొడితే అసలుకే మోసం వస్తుంది. మరో మార్గమేదన్నా చెప్పండ న్నాడు. వెంటనే అజీజ్ వెనుకే కూర్చుని వున్న ఆనం వెంకటరమణారెడ్డి లేచి... మన వద్ద వున్న డబ్బు నాలుగింతలు కావాలంటే ఒకటే మార్గం... రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఈ డబ్బుతో నాలుగు హౌసింగ్ ప్రాజెక్ట్‌లు వేద్దాం... డబ్బుకు డబ్బొ వస్తుంది, చేతి నిండా పని ఉంటుందన్నాడు. రియల్ ఎస్టేట్ హిట్ అయితే డబ్బే, ఫట్‌మంటే ఒంటి మీద గుడ్డలు కూడా మిగలవు. ఆ ఆలోచన వద్దని ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి సలహా ఇచ్చాడు. అక్కడే వున్న రమేష్‌రెడ్డి అందుకుని... నాదొక సలహా, డబ్బు సంపాదనకు సులభమార్గం సినిమా. లోబడ్జెట్‌లో సినిమా తీద్దాం. హిట్ అయితే కోట్ల కొద్దీ డబ్బు, ఫట్‌మన్నా పోయే దేమీ లేదన్నాడు. మరి హీరో, హీరోయిన్‌లు భారీగా రెమ్యూనరేషన్ అడుగుతారు కదా అని అజీజ్ సందేహం వెలిబుచ్చాడు. హీరోగా ఎవరినో ఎందుకు పెడతాం, మన వివేకానే హీరోగా పెడతాం, కళ్లకు నల్లద్దాలు పెడితే ఆయనకు మించిన హీరోలెవ రుంటారు. అదీగాక ఇప్పుడొస్తున్న హీరోలకంటే ఆయనే బాగుంటాడు. రూపాయి రెమ్యూనరేషన్ అక్కరలేదు. రోజుకు నాలుగు ప్యాకెట్లు సిగరెట్లు, అరకిలో వేరుశెనక్కాయలు తీసిస్తుంటే చాలు. హీరోయిన్‌గా కాల్షీట్లు లేక ఖాళీగా వున్న వాళ్లనే పెడతాం, వాళ్లకూ డబ్బులిచ్చే పని వుండదని రమేష్‌రెడ్డి చెప్పాడు. ఆ మాటకు వివేకా... నాకు రెమ్యూనరేషన్ బల్లేదు. నా సిగరెట్లు కూడా నేనే కొనుక్కుంటాను, కాని హీరోయిన్‌గా మాత్రం అనుష్కనే పెట్టాలి. ఇది నా జీవిత కోరిక అని పేచీ పెట్టాడు. అనుష్కకు మాత్రం తక్కువ అవుతుందా... అంటూ అందరూ పెదవి విరిచారు. అంతలో అక్కడకు నైట్‌రైడర్ నారాయణ వచ్చాడు. ఆయన ముఖం ఆనందంతో వెలిగిపోతుంది. వచ్చీరావడం తోటే... మీ అందరికీ శుభవార్త అని అన్నాడు. ఏంటదీ... అని అందరూ కోరస్‌గా అడిగారు. సింగపూర్, చైనాలు మన నెల్లూరు ముదురుదోమ లను హోల్‌సేల్‌గా కొనడానికి ఉత్సాహం చూపిస్తు న్నాయి. ఈ డీల్ కుదిరితే నెల్లూరు అభివృద్ధికి ఇక ఏ నిధులూ అవసరం లేదన్నాడు. ఆ మాట వినడం తోటే అందరూ ఆనందంతో చప్పట్లు కొట్టారు.


2015 జూనియర్ మరియు సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాలలో...
జిల్లాలోనే కాదు... నవ్యాంధ్ర స్టేట్‌లోనూ...
శిఖరాగ్ర మార్కులతో నిలిచిన విశ్వసాయి
VISWASAI EDUCATIONAL SOCIETY



ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో స్టేట్ టాప్ మార్కులతోపాటు
Bi.P.C. లోనే కాదు M.P.C. లో కూడా ఆధిపత్యాన్ని సాధించిన విశ్వసాయి విద్యార్థులు
ఈ ఫలితాలు నెల్లూరులోని మా విశ్వసాయి కళాశాలలో సాధించినవి మాత్రమే. మాకు మరెక్కడా బ్రాంచీలు లేవు

Jr. M.P.C
462 / 470 M. SRINIVASULU NAIDU H.No. 1508120484
461 / 470 A. SREESHARSHA H.No. 1508116849
461 / 470 P. SREEVIDYA H.No. 1508118707

Jr. Bi.P.C
435 / 440 P.V. YESASWINI H.No. 1508120877
433 / 440 M. MANASWI H.No. 1508120411
433 / 440 V. KEERTHI KRISHNA H.No. 1508118985

Sr. M.P.C
988 / 1000 G. KAVYA SHREE SAI H.No. 1508219528
987 / 1000 P. HARICHANDANA H.No. 1508219758
981 / 1000 K. ASRITHA H.No. 1508219784

Sr. Bi.P.C
987 / 1000 D. HARSHITHA REDDY H.No. 1508219909
986 / 1000 K. YASHWANTH H.No. 1508213918
985 / 1000 P. MEHANA REDDY H.No. 1508219913

COURSES OFFERED
Bi.P.C. Directors Batch EAMCET/AIIMS, JIPMER etc.
M.P.C. JOI (IIT-JEE) Programme
Intensive Coaching Batches
Bi.P.C. EAMCET
M.P.C. JEE Main (NIT), EAMCET

Dr. N. Satyanarayana & G. Krishna Mohan's
VISWASAI JUNIOR COLLEGE

Day & Residential
అడ్మిషన్ల వివరములకు ఆఫీసు నందు సంప్రదించగలరు
Annamaiah Circle, Magunta Layout
NELLORE
www.viswasai.com

Ph : 0861-2330065, Mobile : 8886770470, 9160670001, 9160670002, 9160670003, 9160670004.

# ఉత్తరక్రియలు

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి!!

జననం
05-02-1916



మరణం
29-04-2015

## శ్రీ కలికి వెంకురెడ్డి గారు

మంచితనం, మానవత్వం, ఆధ్యాత్మిక విలువలు కలగలసిన మీ వ్యక్తిత్వం మహోన్నతం. ఉదాత్తమైన ఉన్నత విలువలతో సాగిన మీ జీవనయానం మాకు ఆదర్శం. మీరు చూపిన బాట సదా అనుసరణీయం. ఆ బాటలోనే నడుస్తాం. మీరు కోరుకొన్న మాధవ సేవకులమవుతాము. సాయినాథుని సన్నిధికి తరలి వెళ్లిన మీకు

అశృనయన అంజలి ఘటిస్తూ...

భార్య : **కలికి వజ్రమ్మ**

కుమారులు - కోడళ్లు

**కలికి కోదండరామిరెడ్డి - శ్రీలత**
వ్యవస్థాపక ధర్మకర్తలు
శ్రీసాయిబాబా మందిరం ట్రస్ట్, కొత్తూరు.

**కలికి రాజారామిరెడ్డి - శైలజ**

మనుమరాళ్లు - మనుమలు

**డాక్టర్ స్వాతి - డాక్టర్ చదివే జగదీష్**
**తరంగిణి - కలిచేటి రామచరితమానస్**
**దీప్తిరెడ్డి - బెజవాడ సాయిరత్నాకర్**(USA)

**కలికి సునీల్‌కుమార్‌రెడ్డి - సౌమ్య**
**నీలిమ - సొల్లేటి వంశీకృష్ణ** (USA)

మునిమనుమలు, మనుమరాళ్లు

**నిర్మణ్య**
**మేధాన్ష్**
**కిమయాంజని**

**మేఘన భావని**

**ఉత్తరక్రియలు:** తేది. **08-05-2015** శుక్రవారం **నిలుపు,** తేది. **09-05-2015** శనివారం **పెద్దకర్మ**
ఇందుకూరుపేట మండలం, కొత్తూరులోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com